

ఎల్‌పీజీ సంస్థలకు
రూ.35,000కోట్ల పరిహారం 07

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 11.07.2025 | సంపుటి : 2 | సంచిక :158 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Friday 11.07.2025 volume : 2 Issue : 158 Pages : 8 Cost : 2/-




'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 99639 98364

# బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే
# స్థానిక ఎన్నికలు



## 42శాతం అమలుకు అనుగుణంగా ఆర్డినెన్స్
### ఆ తరువాత స్థానిక ఎన్నికల నిర్వహణ
### తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం
### వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

**తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. రిజర్వేషన్ల అమలుకు 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను ఆయన వెల్లడించారు. "ఇవాళ్టితో కలిపి 19 క్యాబినెట్ భేటీలు నిర్వహించాం. ఇప్పటి వరకు జరిగిన భేటీల్లో 321 అంశాలను మంత్రివర్గం ఆమోదించింది.**

హైదరాబాద్, జూలై 10 : తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వీటి ఆధారంగానే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణ యించారు. కేబినేట్ విశేషాలలను మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. బీసీల కు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. రిజర్వేషన్ల అమలుకు 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించి నట్లు తెలిపారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంత రం సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని మాట ఇచ్చామని.. ఈ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపామన్నారు. ఈ బిల్లుకు అనేక కొర్రీలు పెట్టారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో లీగల్ సమస్యలు రాకుండా అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడామన్నారు. 42 శాతం రిజర్వేష న్లతో ఎన్నికలకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయం తీసు కుందని తెలిపారు. డెడికేషన్ కమిషన్ ద్వారా రిజర్వేషన్ ప్రాసెస్ పూర్తి చేస్తుందని వివరించారు. 2018లో ఉన్న చట్టాన్ని ఆర్డినెన్సు ద్వారా సవరించా లని కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరినప్పటి నుంచి మొత్తం 19 కేబినెట్ సమావేశాలు జరిగా యని గుర్తు చేశారు. నేటి వరకు 23 శాఖలకు సంబంధించి 327అంశాలపై ఈ కేబినెట్లలలో చర్చ జరిగిందని వివరించారు. 321 అంశాలను కేబినెట్ ఆమోదించింద న్నారు.

మిగతా 2 లో



## ప్రధాని నరేంద్రమోదీ
# అరుదైన ఘనత
### 17 దేశాల పార్లమెంట్లలో ప్రసంగం
### కాంగ్రెస్ ప్రధానులందరివి 17

**ఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ సరికొత్త మైలురాయిని చేరుకున్నారు. నమీబియా పార్లమెంటులో బుధవారం చేసిన ప్రసంగంతో కలిపితే 11 ఏళ్లలో 17 దేశాల పార్లమెంట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడినట్లయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాల తరఫున మొత్తం ప్రధానులందరూ కలిసి 17 పార్లమెంట్లలో ప్రసంగిస్తే ఒక్క మోదీ ఆ సంఖ్యను సమం చేశారు. దీనిపై భాజపా హర్షం వ్యక్తంచేసింది. వేరే దేశాలకు వెళ్లడం తప్పిస్తే దేశంలోని సమస్యలను పట్టించుకునే తీరిక మోదీకి ఎక్కడుందని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ఐదు దేశాల పర్యటన సందర్భంగా ఘనా, ట్రినిడాడ్-టొబాగో, నమీబియా పార్లమెంట్లలో మోదీ ప్రసంగించడంతోపాటు పురస్కారాలు అందుకున్న విషయం తెలిసిందే. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు విదేశీ పార్లమెం ట్లలో ఏడుసార్లు ప్రసంగించారు. ఇందిరాగాంధీ నాలుగుసార్లు, నెహ్రూ మూడు సార్లు, రాజీవ్ గాంధీ రెండుసార్లు, పీవీ నరసింహారావు ఒకసారి ప్రసంగించారు. మోదీ అమెరికా పార్లమెంటులో రెండుసార్లు మాట్లాడారు. విదేశీ పార్లమెంట్లలో ప్రసంగించడం ద్వారా మోదీ నాయకత్వానికి ప్రపంచస్థాయిలో గౌరవం దక్కు తోందని భాజపా ట్వీట్ చేసింది. ఆయన నాయకత్వంలో దేశ ప్రయోజనాలు పదిలమనే నమ్మకం ప్రజలకు ఉందని పార్టీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది విలేకరుల సమావేశంలో చెప్పారు. సైనిక, దౌత్య, వాణిజ్య ప్రయోజనాలను ఆయన కాపాడతారన్నారు.



03
శ్రీశైలం జలాశయానికి
**భారీగా వరద**
మూడు గేట్లు ఎత్తి నీటి విడుదల



03
సికింద్రాబాద్
**బోనాల జాతర**
రెండ్రోజుల పాటు వైన్స్ మూసివేత



02
14న భూమికి
**తిరిగిరానున్న శుభాంశు శుక్లా**



02
ఆపరేషన్ కగార్‌పై మాట్లాడితే
**అర్బన్ నక్సల్ అన్నారు**
పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



03
బ్రిడ్జి దుర్ఘటనలో
**15కు పెరిగిన మృతుల సంఖ్య**
- మరో ముగ్గురి కోసం గాలింపు ముమ్మరం
- ఘటనపై విచారణ జరపాలని ప్రియాంక డిమాండ్



03
హెచ్‌సీఏలో రెండేళ్లలో
**170 కోట్ల గోల్‌మాల్**
సిఐడి విచారణలో
వెలుగుచూసిన అవినీతి

## అసెంబ్లీ సమావేశాల్లో
# మీడియాదే కీలకపాత్ర
- ఉభయ సభలు సజావుగా సాగడానికి సహకరించాలి
- మీడియా సలహా కమిటీ భేటీలో స్పీకర్ ప్రసాద్ కుమార్



హైదరాబాద్, జూలై 10 : తెలంగాణ ఉభయ సభలు సజావుగా జరగడా నికి అంద రూ సహకరించాలని, ముఖ్యంగా మీడియా ప్రతినిధులు ఇందులో కీలక పాత్ర పోషించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ మొదటి సమావేశం గురువారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణాచారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మిగతా 2 లో



03
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో
**సత్తా చాటుదాం**
పార్టీ మైనార్టీ సెల్
సమావేశంలో హరీష్ రావు



03
కల్తీకల్లుకు ఆరుగురు
**బలవ్వడం దారుణం**
ఒక్కో కుటుంబానికి 20లక్షల
పరిహారం చెల్లించాలి : కేటీఆర్

## బెట్టింగ్ యాప్‌ల కేసులో
# రంగంలోకి ఈడీ
- 29 మంది సెలబ్రిటీలపై ఈసీఐఆర్.. హవాలా కోణంపై ఆరా
- నిందితుల జాబితాలో రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్ మంచు లక్ష్మి, ప్రణీత తదితరులు

02

బెట్టింగ్ యాప్‌ల కే సులో కీలక పరిణా మం చోటు చేసుకు ంది. ఈ తరహా యాప్‌ల కోసం ప్ర మోషన్ల వ్యవహా రంలో మనీ లాండ రింగ్ జరిగిందనే కో ణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగం లోకి దిగింది. 29 మం ది సినీనటులు , యూ ట్యూబర్లు, ఇన్‌ఫ్లుయె న్సర్లపై కేస్ నమోదు చేసింది.



## యెమెన్‌లో కేరళ నర్సుకు
# మరణశిక్ష..
### స్పందించిన సుప్రీం ధర్మాసనం



10



03
రైల్వేలపై కేంద్రం
**కీలక నిర్ణయం**
- 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభం
- వచ్చే ఐదేళ్లలో పట్టాలకెక్కనున్న వెయ్యి కొత్త రైళ్లు
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

## నదీజలాల సద్వినియోగంపై
# చర్చించాలి!
- పరస్పర అవగాహనతో కార్యాచరణ
- వృధా నీటిపై చర్చలతోనూ సత్ఫలితాలు

ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకు నేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించుకోవడం, నిర్వహిం చుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి.



04

# ఆపరేషన్ కగార్‌పై మాట్లాడితే అర్బన్ నక్సల్ అన్నారు

## పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన



**హైదరాబాద్, జూలై 10 :** ఆపరేషన్ కగార్‌పై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన వెంటనే తనపై అర్బన్ నక్సలైట్, దేశద్రోహి ముద్ర వేశారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సీపీఐ మఖ్దూమ్ కార్యాలయ పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భం గా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ, మఖ్దూమ్ తెలుగు నేలపై జన్మించిన గొప్ప కమ్యూనిస్టు నేత అని కొనియాడారు. సింగరేణి కార్మిక ఉద్యమంతో ఆయనకు ఆత్మీయ సంబంధం ఉందని తెలిపారు. 1974 ఫిబ్రవరి 17న జరిగిన ఈ కార్యాలయ పునాది కార్యక్రమానికి అప్పటి కాంగ్రెస్ మంత్రులు హాజరయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్–కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిదని స్పష్టంచేశారు. నేను ఎప్పటినుంచో కమ్యూనిస్టు భావజాలానికి మద్దతుగా ఉన్నాను. ఈ దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవాలంటే లెఫ్ట్ శక్తులు బలపడాలి. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో పాటు– కమ్యూనిస్టులతో కలిసి విజయాన్ని సాధించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన ఆయన, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ భూసంపదను కార్పొరేట్ కంపెనీలకు దక్కించేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా, కేంద్రం మానవతా దృక్పథంతో కాకుండా మారణయత్నాలతో ముందుకు వెళుతోంది. ఇది బాధాకరం అని అన్నారు. ఇక ఎలక్షన్ కమిషన్ వ్యవహారాలపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని వ్యక్తులకు లాభం చేకూర్చే విధంగా ఈ సంస్థ మారిందని, ఇది ప్రజాస్వామ్యానికి శోచనీయ పరిణామమని విమర్శించారు.

# బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

కేబినెట్ ఆమోదించిన అన్ని అంశాల అమలుపై ఈ రోజు సమావేశంలో చర్చించామని తెలిపారు. కేబినెట్ ఆమోదించిన 96 శాతం అంశాలు అమలులోకి వచ్చాయని వివరించారు. మళ్లీ జులై 25న కేబినెట్ సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలకొకసారి కేబినెట్ నిర్ణయాలపై చర్చిస్తామ న్నారు. ఇక అమిత్, సెయింట్ మేరీ విద్యా సంస్థలను యూనివర్సిటీలుగా గుర్తిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు.

### గోశాలలకు కొత్త పాలసీ

రాష్ట్రంలో గోశాలలకు కొత్త పాలసీ తీసుకు వస్తున్నట్లు– వివరించారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల భూ సేకరణ పూర్తి చేయాలని కూడా నిర్ణయించామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ అంశంలో న్యాయ సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌ను ఈ కేబినెట్ సమావేశానికి ఆహ్వానించామన్నారు. ఆయనతో ఈ అంశంపై చర్చించామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం.. మార్చిలోపు మరో లక్ష ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయ్యాలని నిర్ణయించామని చెప్పారు. దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశాం అని పొన్నం ప్రభాకర్

### మార్చిలోపు లక్ష ఉద్యోగాలు



17వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చేందుకు జాబ్ క్యాలెండర్ సిద్ధంగా ఉందన్నారు. మార్చిలోపు లక్ష ఉద్యోగాలు ఇచ్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే 60వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. గోశాల పాలసీపై చర్చ చేశామని చెప్పారు. ఎంకేపల్లి, యాదగిరి గుట్ట, వేములవాడలలో అత్యాధునిక గోశాలలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. 82 కోట్ల చేప పిల్లలను ఈసారి చెరువుల్లో పెంచడానికి రూ. 120 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో పదేళ్లపాటు రిజర్వేషన్లు అమలయ్యేలా చేసిన చట్టానికి సవరణ చేయాలని కూడా ఈ కేబినెట్‌లో నిర్ణయించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ చట్టంలో సవరణలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన ఆర్డినెన్స్‌ను త్వరలో జారీ చేయాలని యోచిస్తోంది. ఇదే కారణంగా రాష్ట్ర అసెంబ్లీని ప్రోరోగ్ చేసినట్లు సమాచారం. అలాగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించే దిశగా ప్రభుత్వం ఆలోచనలో ఉంది. ఇకపై హైకోర్టు ఆదేశాల ప్రకారం, సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేబినెట్‌లో ఈ అంశంపై కూడా కీలక చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వర్షాకాలం ప్రారంభమై ఉన్న నేపథ్యంలో, భారీ వర్షాలు, వరదల పరిస్థితులను ఎదుర్కొనడంలో అవసరమైన ముందస్తు చర్యలు, సహాయ చర్యల అమలుపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. గత కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించడంతో పాటు, ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాల పురోగతిపై కూడా మంత్రివర్గం సమీక్షించింది.

# సికింద్రాబాద్ బోనాల జాతర

## రెండ్రోజుల పాటు వైన్స్ మూసివేత

**హైదరాబాద్, జూలై 10 :** సికింద్రాబాద్ ఉజ్జయిని బోనాలను పురస్కరించుకని రెండు రోజుల పాటు వైన్ షాపులు బంద్ చేస్తున్నట్లు పోలీస్ శాఖ వెల్లడించింది. హైదరాబాద్ మహానగరంలోని సికింద్రాబాద్‌లో బోనాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జులై 13వ తేదీ ఉదయం 6:00 నుండి 15వ తేదీ ఉదయం 6:00 గంటల వరకు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ హైదరాబాద్ పరిధిలోని వైన్స్ షాపులు, బార్లు బంద్ ఉంటాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి జాతర (బోనాలు) సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపారు. సెంట్రల్ జోన్ పరిధిలో గాంధీ నగర్ డివిజన్.. అలాగే ఈస్ట్ జోన్ పరిధిలో చిలకలగూడ డివిజన్‌లోని చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ.. అదే విధంగా నార్త్ జోన్ పరిధిలో బేగంపేట డివిజన్, గోపాలపురం డివిజన్ పరిధిలో గోపాలపురం, తుకారాం గేట్, మారేడుపల్లితోపాటు– మహంకాళి డివిజన్ అంటే.. మహంకాళి, రామ్‌గోపాల్‌పేట, మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపులన్నీ మూసి ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో వివరించారు. ఆషాఢ మాసం ప్రారంభమైంది. తెలంగాణలో బోనాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. బోనాలు నేపథ్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. నగరంలోని ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

# చైనాలో అధికార మార్పిడి తప్పదా

- కొంతకాలంగా అజ్ఞాతంలోకి జిన్‌పింగ్
- జిన్‌పింగ్‌ను తప్పించేపనిలో కమ్యూనిస్టులు
- ప్రపంచవ్యాప్తంగా చైనా రాజకీయాలపై చర్చ

**బీజింగ్, జూలై 10 :** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగిపోతున్నారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన అధికారం నుంచి తప్పుకోబోతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కొంతకాలంగా జిన్‌పింగ్ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, బ్రిక్స్ సమావేశానికి హాజరు కాకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. నియంతృత్వ పోకడలతో చైనా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ఎందుకు అనూహ్యంగా తప్పుకుంటున్నారన్నది అంతు చిక్కట్లేదు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు, అంతర్జాతీయ మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దానికి పైగా చైనా రాజకీయాలను శాసిస్తున్న జిన్‌పింగ్, తన పాలనా పగ్గాలను నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీలోని కీలక విభాగాలకు బదిలీ చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జిన్‌పింగ్ పలు కీలక అంతర్జాతీయ సమావేశాలకు, దేశీయ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఆయన గైర్హాజరయ్యారు. గత 12 ఏళ్లలో ఆయన బ్రిక్స్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే మొదటిసారి. చైనాలో జిన్‌పింగ్ తనదైన ముద్ర వేశారు. ఓ నియంతగా పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో చైనాను అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. షీ జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. తన పాలన ప్రారంభంలోనే అగ్రశ్రేణి నాయకుల నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరినీ లక్ష్యంగా చేసుకున్నారు. భారీ ఎత్తున అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది పార్టీలో తన ప్రత్యర్థులను తొలగించి, తన పట్టు నిలుపు కునేందుకు సహాయపడింది. జిన్‌పింగ్ తనకు అనుకూలంగా 2018లో రాజ్యాంగాన్ని సైతం సవరించారు. అధ్యక్ష పదవికి ఉన్న రెండు–పదవీకాలాల పరిమితిని తొలగించారు. ఇది ఆయనకు జీవితకాల అధ్యక్షుడిగా ఉండే అవకాశాన్ని కల్పించింది. ఈ చర్య ద్వారా ఆయన అధికారాన్ని తన గుప్పిట్లో శాశ్వతంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. అందుకే ఆయన ఓ నియంతలా పేరు తెచ్చుకున్నారు. చైనా చరిత్రలో మావో జెడాంగ్ తర్వాత అత్యంత శక్తివంతమైన నాయకుడిగా మారారు. శాశ్వత అధ్యక్షుడిగా ఉండేందుకు జిన్‌పింగ్ రాజ్యాంగ నిబంధనలను మార్చుకున్నప్పటికీ, ఇప్పుడు ఆయన అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధమయ్యారనే వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. అయితే దీని వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. నిర్మాణ రంగం సంక్షోభంలో ఉంది. యువతకు ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి.

## మహిళలకు ఇచ్చిన వాగ్దానాల అమలుపై

# చర్చకు సీఎం సిద్ధమేనా?

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**కొత్తగూడెం :** ఎన్నికల సమయంలో అతివలకు ఇచ్చిన వాగ్దానాల అమలును ప్రశ్నించేందుకు జాగృతి ఆధ్వర్యంలో మహిళలు కమాండ్ కంట్రోల్ వద్దకు చేరుకొంటారని, అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు సిద్ధమేనా? అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. జాగృతి విస్తృతస్థాయి సమావేశం గురువారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించారు. పదేపదే కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటున్న ముఖ్యమంత్రి మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం ఎందుకు ఇవ్వడంలేదో కమాండ్ కంట్రోల్ వద్ద చర్చలో జవాబివ్వాలన్నారు. భద్రాచలం దేవస్థానం పరిధిలోని 5 గ్రామాల పరిధిలో గుడికి చెందిన వెయ్యి ఎకరాల భూమి ఆంధ్రాలో కలిసిందని, దాన్ని తిరిగి తెలంగాణలో కలపాల్సిందిగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖను పంపుతున్నామన్నారు. 2014లో 52 శాతం మంది ఉన్న బీసీలు ప్రస్తుతం 46 శాతానికి ఎలా తగ్గారో చెప్పాలని, కేవలం 42 శాతం సీట్లను బీసీలకు కేటాయించాలని నిర్ణయించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ప్రాంత కొత్త గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నవీనాచారి, కిషన్‌నాయక్, అజ్మీరా కిశోర్, కృష్ణకాపు, భిక్షపతి, హుస్సేన్, సింధుతపస్వి తదితరులు పాల్గొన్నారు.



# సత్వరమే చేనేత రుణమాఫీ: తుమ్మల

**హైదరాబాద్:** తెలంగాణ నేతన్నకు భరోసా పథకంలో భాగంగా రూ.48.8 కోట్లు కేటాయించామని, కార్మికుల నమోదు ప్రక్రియ పూర్తికాగానే జియో ట్యాగ్ మగ్గం మీద పనిచేస్తున్న కార్మికులకు ఏటా రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6 వేల చొప్పున రెండు విడతల్లో విడుదల చేస్తామని చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణమాఫీ పథకాన్ని సత్వరమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చేనేత, జౌళి పథకాలపై గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) కోసం యాదాద్రి జిల్లా పోచంపల్లిలో శాశ్వత భవనాలు నిర్మించాలని మంత్రి సూచించారు. జాతీయ చేనేత పురస్కారం–2024కు ఎంపికైన యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన గజం నర్మద, గూడ పవన్‌లను ఈ సందర్భంగా మంత్రి సన్మానించారు.

# ప్రభాకర్‌రావు అరెస్టుకు అనుమతివ్వండి!

## ఆయన విచారణకు సహకరించడం లేదు

## సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్న సిట్

**హైదరాబాద్, జూలై 10 :** ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు గురువారం ఢిల్లీ వెళ్లారు. ప్రభాకర్‌రావు విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీ వెళ్లినట్లు తెలిసింది. ప్రభాకర్‌రావును వచ్చే నెల 5 వరకు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరవుతున్న ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారులకు సహకరించడం లేదని, 40గంటలు విచారించినా ట్యాపింగ్ వెనక ఉన్నదెవరన్న విషయాలను ఆయన బయటపెట్టడం లేదని అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేయనున్నారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, మోసపూరిత విధానాలను అనుసరించారని విచారణలో స్పష్టమైందని చెప్పనున్నారు. అయితే, ఫోన్ ట్యాపింగ్‌కు ప్రేరేపించింది ఎవరు? జర్నలిస్టులు, వ్యాపారులు, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చిందెవరనే విషయాన్ని నిర్ధారించుకోవాలంటే ప్రభాకర్‌రావును కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందని చెప్పనున్నారు.



### జానయ్యయాదవ్‌కు సిట్ నోటీసు

ఫోన్ ట్యాపింగ్ కేసులో సూర్యాపేట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌కు సిట్ గురువారం నోటీసు జారీ చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన వట్టె జానయ్యయాదవ్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఈ నెల 14న విచారణకు రావాలని సిట్ అధికారులు తెలిపారు. జానయ్యయాదవ్ మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారని ఆరోపించారు.

# బెట్టింగ్ యాప్‌ల కేసులో రంగంలోకి ఈడీ

- 29 మంది సెలబ్రిటీలపై ఈసీఐఆర్.. హవాలా కోణంపై ఆరా
- నిందితుల జాబితాలో రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్ మంచు లక్ష్మి, ప్రణీత తదితరులు

**హైదరాబాద్:** బెట్టింగ్ యాప్‌ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ తరహా యాప్‌ల కోసం ప్రమోషన్ల వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందనే కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగింది. 29 మంది సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసింది. ఈ కేసులో నిందితుల జాబితాలో సినీనటులు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్, ప్రణీత సుభాశ్, అనన్య నాగళ్లతోపాటు టీవీ యాంకర్ శ్రీముఖి, శ్యామల తదితరులున్నారు. నిందితులు జంగిల్ రమ్మీ, జీత్‌విన్, లోటస్ 365.. తదితర బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్లు చేయడం వివాదాస్పదమైంది. వీరి ప్రమోషన్ల ప్రభావంతో పలువురు యువకులు బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోవడంతోపాటు కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు రూ.వేల కోట్ల డబ్బు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఆయా ఘటనల నేపథ్యంలో సినీప్రముఖులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆయా కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ఆరంభించింది. ప్రమోషన్లు చేసినందుకు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు హవాలా మార్గంలో పలువురికి డబ్బు పంపించారనే కోణంలో ఆరా తీస్తోంది. ఇప్పటికే తెలంగాణ పోలీసుల నుంచి ప్రాథమిక దర్యాప్తు వివరాలను ఈడీ సేకరించింది. త్వరలోనే నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది.



# 14న భూమికి తిరిగిరానున్న శుభాంశు శుక్లా



**దిల్లీ:** యాక్సియం–4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు ఈ నెల 14న భూమికి తిరిగి రానున్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ–నాసా గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. యాక్సియం–4 మిషన్ ద్వారా శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ–విస్నియొస్కీ, టిబర్ కపు ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లారు. 28 గంటల ప్రయాణం తర్వాత వారు ఐఎస్ఎస్‌లో ప్రవేశించారు. దాదాపు రెండు వారాలుగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లా.. అక్కణ్నుంచి ఇప్పటివరకూ 230 సూర్యోదయాలు చూశారు. ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. యాక్సియం స్పేస్ ఈ మేరకు తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. యాక్సియం–4 వ్యోమగాములు ఇప్పటిదాకా దాదాపు 230 సార్లు భూమిని చుట్టి వచ్చారని అందులో పేర్కొంది.

# ఫీజుల పెంపు నిర్ణయంలో ఎందుకీ జాప్యం?

## టీఏఎఫ్ఆర్సీ తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి

**హైదరాబాద్:** ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపునకు సంబంధించి ఏటా ఓ తంతు నడుస్తోందంటూ టీఏఎఫ్ఆర్సీ(తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ) తీరుపై హైకోర్టు గురువారం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏటా కాలేజీలు ఫీజుల పెంపునకు ప్రతిపాదనలు చేయడం, కౌన్సెలింగ్ పూర్తయి అడ్మిషన్‌లు చేపట్టేదాకా దానిపై టీఏఎఫ్ఆర్సీ సిఫారసులు చేయకపోవడం, కాలేజీలు కోర్టును ఆశ్రయించడం అన్నది ఏటా కొనసాగుతోందని వ్యాఖ్యానించింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో గత బ్లాక్ పీరియడ్ ఫీజులే 2025–26కు వర్తిస్తాయంటూ జారీ చేసిన జీవో 26ను సవాలు చేస్తూ గురునానక్, గోకరాజు రంగరాజు కాలేజీలతో పాటు సుమారు 11 కళాశాలలు గురువారం లంచ్ మోషన్ పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి మూడేళ్లకోసారి కాలేజీలను పరిశీలించి పెంపుపై నిర్ణయం తీసుకోలేకపోవడం సరికాదన్నారు. డిసెంబరులో ప్రతిపాదనలు వస్తే జూన్ వరకు నిర్ణయం తీసుకోలేదని, 15 మంది సభ్యులదాకా ఉన్న కమిటీ నిర్ణయంలో జాప్యమెందుకన్నారు. టీఏఎఫ్ఆర్సీపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని, కౌన్సెలింగ్ పూర్తయ్యాక పిటిషన్‌లు వేయడమేమిటని కాలేజీలను ప్రశ్నించారు. కళాశాలల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ గత డిసెంబరులో ప్రతిపాదనలు సమర్పించామని, మార్చిలో కమిటీ సమావేశమైందని, అందులో తమ ప్రతిపాదనలు ఆమోదించిందని, దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే నిదర్శనమన్నారు. టీఏఎఫ్ఆర్సీ తరఫు సీనియర్ న్యాయవాది పి.శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ కాలేజీలు 5,000 పేజీలతో ప్రతిపాదనలు సమర్పించాయని, వీటిని పరిశీలించడానికి సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో గత బ్లాక్ పీరియడ్‌లో వసూలు చేసిన మొత్తాన్నే ఈ ఏడాదికి సిఫారసు చేసిందన్నారు. ప్రభుత్వం తరఫున రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కాలేజీల్లో కొన్ని గత ఏడాది కంటే సుమారు 70 నుంచి 90 శాతం పెంపు అడుగుతున్నాయన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మధ్యంతర పిటిషన్‌లపై శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామంటూ విచారణను వాయిదా వేశారు. అయితే కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ దాఖలు చేసిన పిటిషన్‌లను మరో న్యాయమూర్తి ముందుంచాలంటూ రిజిస్ట్రీని ఆదేశించారు. ఇంజినీరింగ్‌లో రూ.2.23 లక్షల ఫీజు వసూలుకు సీబీఐటీకి బుధవారం జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఇచ్చిన ఉత్తర్వులను పునఃసమీక్షించాలని కోరనున్నామని టీఏఎఫ్ఆర్సీ తరఫు న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు.



# అసెంబ్లీ సమావేశాల్లో మీడియాదే కీలకపాత్ర

- ఉభయ సభలు సజావుగా సాగడానికి సహకరించాలి
- మీడియా సలహా కమిటీ తొలి భేటీలో స్పీకర్ ప్రసాద్ కుమార్



**హైదరాబాద్, జూలై 10:** తెలంగాణ ఉభయ సభలు సజావుగా జరగడానికి అందరూ సహకరించాలని, ముఖ్యంగా మీడియా ప్రతినిధులు ఇందులో కీలక పాత్ర పోషించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ మొదటి సమావేశం గురువారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్ లో జరిగింది. ఈ సమావేశంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణాచారి,కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా కమిటీ- చైర్మన్, కో చైర్మన్ కమిటీ సభ్యులకు స్పీకర్, చైర్మన్, మంత్రి, సెక్రటరీలు పుషగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...**

తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ- చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస రెడ్డి , కో చైర్మన్ పరిపూర్ణాచారి మరియు సభ్యులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన శాసనసభ, మండలి గౌరవం, ప్రాధాన్యతలను కాపాడుతూ మీడియా సలహా మండలి ద్వారా మీ వంతుగా సేవలను అందించడం మంచి అవకాశం అని చెప్పారు. సీనియర్ జర్నలిస్టులుగా మీరు ఎంతో అనుభవం ఉన్నవారని, ఉభయ సభలు సజావుగా జరగడానికి తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందించాలని కోరారు. మనందరం కలిసి శాసనసభ, శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగి, అర్థవంతమైన చర్చల జరిగే విధంగా చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని అందరి ఉద్యేశం అని వ్యాఖ్యానించారు. శాసనసభ సమావేశాల సమయంలోనే కాదు, ఇతర సమయాలలో కూడా శాసనసభ కు సంబంధించిన వార్తలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

**శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..**

శాసనసభ ,శాసనమండలి సమావేశాలు సజావుగా నడవాలి అంటే మీడియా పాత్రనే కీలకమని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ- సభను హుందాగా నడవడానికి అన్ని విధాలుగా సహకారం అందించాలని, రానున్న రోజుల్లో శాసన సభ,శాసన మండలి ఒకే భవనంలోకి రాబోతున్నాయి కావున కొన్ని చేంజెస్ కూడా చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మీడియా కమిటీ- సభ్యులకు ఎలాంటి సహాయం కావాలన్న అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ...**

శాసనసభ, శాసన మండలి వ్యవహారాలలో మీడియాకు బాధ్యతను కల్పించడానికి, మరింత పాత్రను పోషించడానికే మీడియా అడ్వైజరీ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఉభయ సభల నిర్వాహణలో అందరి సహకారాన్ని కోరారు. సమావేశాల సందర్భంగా మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, వసతులపై ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సమావేశాల సందర్భంగా జారీ చేసే పాస్ ల విషయంలో కమిటీ సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, మంచి వాతావరణంలో సమావేశాలు జరిగే విధంగా అందరం కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ- చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... సమావేశాల సందర్భంగా కవరేజ్ చేసే మీడియా ప్రతినిధులందరికి పాస్ లు అందే విధంగా సూచనలను అందిస్తామని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులకు అవసరమయ్యే సౌకర్యాలపై అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సూచనలను చేస్తామని తెలిపారు.

## రైల్వేలపై కేంద్రం కీలక నిర్ణయం

- 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభం
- వచ్చే ఐదేళ్లలో పట్టాలకెక్కనున్న వెయ్యి కొత్త రైళ్లు
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 10 :** రైల్వేలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఐదేళ్లలో కొత్తగా వెయ్యి రైళ్లను పట్టాలు ఎక్కించాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం న్యూఢిల్లీలో వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో ఈ కొత్త రైల్వే సర్వీసులు ప్రారంభిస్తామని అన్నారు. 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభించడమే భారతీయ రైల్వే లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. రైల్వే ఎగుమతులు ద్వారా ప్రపంచంలోనే భారత్ కీలక పాత్ర పోషించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక రైల్వే ద్వారా సరుకు రవాణాలో ఇది దేశానికే వెన్నుముకగా నిలవనుంద న్నారు. గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా 35 వేల కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌ను నిర్మించామని వివరించారు. ఇది జర్మనీ దేశంలోని మొత్తం రైల్వే ట్రాక్‌తో సమానమని సోదాహరణగా చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 5,300 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను భారతీయ రైల్వే నిర్మించిందని చెప్పారు.ఏడాదిలో 30 వేల వ్యాగిన్లు, 15వందల లోకోమోటివ్ లను భారతీయ రైల్వే తయారు చేస్తుందని పేర్కొన్నారు. ఇది ఉత్తర అమెరికా, యూరప్ తయారు చేస్తున్న రైల్వే వ్యాగిన్ల కంటే అధికమన్నారు. మరోవైపు భారతీయ రైల్వేలో పెట్టబడులు రూ. 2 వేల కోట్ల నుంచి రూ. 2.25 లక్షల కోట్లు ఏగబాకాయని చెప్పారు. అందులో రూ. 20 వేల కోట్లు.. పీపీపీ ద్వారా అదనంగా వచ్చాయని ఆయన వివరించారు. జపాన్ సహకారంతో బుల్లెట్ రైలు తయారు చేస్తున్నామన్నారు. ఇది 2026 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామని తెలిపారు. 2027లో దీనిని ప్రారంభిస్తామన్నారు. ఇక ఏడాదిలో రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు 170 నుంచి 30కి తగ్గాయన్నారు. మొత్తంగా పరిశీలిస్తే.. రైలు ప్రమాదాలు 80 శాతం మేర తగ్గాయని వివరించారు. ట్రాకులు అప్ గ్రేడ్ చేయడం.. పాయింట్స్, సిగ్నలింగ్ వ్యవస్థలను ప్రతి రోజు సమీక్షించడం ద్వారా ఈ ప్రమాదాల నివారించడం సాధ్యమైందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.

## బ్రిడ్జి దుర్ఘటనలో 15కు పెరిగిన మృతుల సంఖ్య

- మరో ముగ్గురి కోసం గాలింపు ముమ్మరం
- ఘటనపై విచారణ జరపాలని ప్రియాంక డిమాండ్

**గాంధీనగర్, జూలై 10 :** ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్ లో ఘోర దుర్ఘటన జరిగింది. వడోదర జిల్లాలోని పద్రా పట్టణ సమీపంలో గల మహిసాగర్ నదిపై నిర్మించిన 40 ఏళ్ల పురాత వంతెన బుధవారం ఉదయం కుప్పకూలిన విషయం తెలిసిందే. గంభీర బ్రిడ్జిలోని కొంత భాగం నదిలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య తాజాగా 15కు పెరిగింది. ముగ్గురు వ్యక్తుల ఆచూకీ ఇంకా లభించ లేదని జిల్లా కలెక్టర్ అనిల్ ధమేలియా తెలిపారు. 'బ్రిడ్జి కూలిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 15కు పెరిగింది. ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. వారి కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయని తెలిపారు. 900 మీటర్ల పొడవున్న ఈ వంతెనలోని రెండు పిల్లర్ల మధ్య ఉన్న స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలి నీటిలో పడిపోయింది. దీంతో ఆ స్లాబ్ మీద ఉన్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఓ ఆటోరిక్షా, మరో బైక్ నీటిలో పడిపోయినట్టు- పేర్కొన్నారు. అప్పుడే స్లాబ్ చివరివరకూ వచ్చిన ఓ పెద్ద ట్యాంకర్ ప్రమాదకరంగా వేలాడిందని, మరో వాహనం కూడా ఇలాగే నిలిచిపోయిందని తెలిపారు. సెంట్రల్ గుజరాత్, సౌరాష్ట్రను గంభీర వంతెన కలుపుతుంది. తాజా ఘటనతో ఇరు ప్రాంతాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదిలావుంటే వడోదరలో గంభీర బ్రిడ్జి కూలిపోయిన ఘటనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారన్న ప్రియాంక గాంధీ.. భారీ బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద ప్రాంతంలో రెండవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, అదే సమయంలో దర్యాప్తు కూడా జరగాలని ప్రియాంక గాంధీ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఈ అంశంపై స్పందించారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గుజరాత్ వంతెన కూలిపోవడం, అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి ఇటీవలి విషాదాలు నాయకత్వ సంక్షోభం, అవినీతి, అసమర్థత ఫలితంగా జరిగాయని ఆరోపించారు.

## హెచ్‌సీఏలో రెండేళ్లలో 170 కోట్ల గోల్‌మాల్

### సిఐడి విచారణలో వెలుగుచూసిన అవినీతి

**హైదరాబాద్, జూలై 10:** హెచ్‌సీఏలో రెండేళ్లలో 170 కోట్ల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్లు సీఐడీ గుర్తించింది. ప్లేయర్స్ ఎంపికలో అవినీతి చేసినట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. హెచ్‌సీఏ సభ్యులు ప్లేయర్స్ తల్లిదండ్రులు నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. హెచ్‌సీఏలో చెక్ పవర్‌ను దుర్వినియోగం చేసినట్లు- తేలింది. బీసీసీఐ ద్వారా వచ్చిన నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని సీఐడీ పేర్కొంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును తెలంగాణ సీఐడీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2025 సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో టికెట్ల వివాదం నేపథ్యంలో చేపట్టిన దర్యాప్తులో ఆర్థిక అక్రమాలు వెలుగుచూడటంతో.. జగన్‌మోహన్‌ని సీఐడీ అదుపులోకి తీసుకుంది. జగన్‌మోహన్‌తోపాటు హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్, ఆయన భార్య కవితలను సీఐడీ అరెస్ట్ చేసి విచారించింది. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్‌ఆర్‌హెచ్ నుంచి కాంప్లిమెంట్రీ- పాస్‌లను సైతం బ్లాక్‌లో అమ్ముకొని నిందితులు సొమ్ము చేసుకున్నారు. క్రీడాకారుల కోసం ఉపయోగించాల్సిన కాంప్లిమెంటరీ పాస్‌లలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని తేలింది. ఎస్‌ఆర్‌హెచ్‌పై జగన్మోహన్ రావు వేధింపుల వ్యవహారంలో యాజమాన్యం స్టేట్‌మెంట్‌ను సీఐడీ రికార్డ్ చేసింది. ఐపీఎల్ 2025 టికెట్ల కోసం జగన్‌మోహన్ రావు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు- ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎస్‌ఆర్‌హెచ్,హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం నెలకొనడంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేయాలని సీఐడీని ప్రభుత్వం ఆదేశించింది. ఎస్‌ఆర్‌హెచ్, టీ-సీఏ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీఐడీ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసింది. ఆర్థిక అక్రమాలు, పత్రాల ఫోర్జరీ, బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపులు, నిధుల మళ్లింపు విడుదల వంటి ప్రాథమిక ఆధారాలు సీఐడీ సేకరించింది. నివేదిక ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసి జగన్‌మోహన్ రావును అరెస్ట్ చేసింది.





## జగన్మోహన్ రావు తదితరులకు రిమాండ్

**హైదరాబాద్, జూలై 10:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష ఎన్నికలో అక్రమాల కేసులో అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు మరో నలుగురికి మల్కాజ్‌గిరి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. వారిని అరెస్టు చేసినట్లు సీఐడీ గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. జగన్మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు, సునీల్, రాజేందర్ యాదవ్, కవితకు వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించినట్లు సీఐడీ ఆరోపిస్తోంది. గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ సంతకాన్ని శ్రీచక్ర క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌కు అందించారు. ఆ పత్రాలను ఉపయోగించి జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడైనట్లు సీఐడీ చెబుతోంది. అలాగే అవినీతి కూడా జరిగినట్లు తేల్చింది. ఈ క్రమంలో వీరికి కోర్టు రిమాండ్ విధించింది. నలుగురిని చర్లపల్లి జైలుకు తరలించగా, కవితను చంచల్‌గూడా మహిళా జైలుకు తరలించారు.

## కల్తీ కల్లు ఘటనలో 44కి చేరిక బాధితులు : మంత్రి

**హైదరాబాద్, జూలై 10:** హైదరాబాద్ కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 44కి చేరింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో ఏడుగురికి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కూకట్‌పల్లి పరిధిలోని పలు కల్లు కాంపౌండ్‌లలో కల్తీకల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

## కల్తీకల్లుకు ఆరుగురు బలవ్వడం దారుణం

### ఒక్కో కుటుంబానికి 20లక్షల పరిహారం చెల్లించాలి : కేటీఆర్




**హైదరాబాద్, జూలై 10:** హైదరాబాద్‌లో కల్తీ కల్లు బారిన పడి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలన్నారు. ఒక్కొక్క కుటుంబానికి 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి మెరుగైన చికిత్స అందించాలని కోరుతున్నట్లు కెటిఆర్ తెలిపారు. కుటుంబం కోసం కాయాకష్టం చేసే కష్టజీవులు కల్తీ కల్లు బారిన పడకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. ఇంతమంది చనిపోతే ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమని మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేస్తూ కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## ఎసిబికి చిక్కిన నిమ్జ్ అధికారులు

**సంగారెడ్డి, జూలై 10 :** జిల్లాలో అవినీతి నిరోధక శాకు రెండు పెద్ద అవినీతి తిమింగళాలు చిక్కాయి. గురువారం జహీరాబాద్ లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మానుఫ్యాక్చరింగ్ జోన్(నిమ్జ్) అధికారులు ఎసిబి వలలో పడ్డారు. నిమ్జ్ డిప్యూటీ- కలెక్టర్ రాజు, డిప్యూటీ- తహసీల్దార్ సతీశ్ లు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టు-బడ్డారు. భూసేకరణ పరిహారం చెక్కులు ఇచ్చేందుకు లంచం అధికారులు డిమాండ్ చేయడంతో బాధితరులు ఎసిబిని ఆశ్రయించారు. బాధితుల నుంచి 65 వేల రూపాయలు లంచంగా తీసుకుంటు-ండగా అధికారులు రాజు, సతీశ్ లను ఎసిబి పట్టుకుంది. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు విచారిస్తున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదాం

### పార్టీ మైనార్టీ సెల్ సమావేశంలో హరీష్ రావు



**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదామని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చా రు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ ఆధ్వర్యం లో బీఆర్ఎస్ హైదరాబాద్ మైనార్టీ విభాగం సమావేశాన్ని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తమది సెక్యులర్ ప్రభుత్వమని చెప్పుకొనే కాంగ్రెస్.. 20 నెలలు గడుస్తున్నా ఒక్క మైనార్టీనేతను మంత్రిగా చేయలేదన్నారు. హైడ్రా, మూసీ పేర్లతో రేవంత్ సర్కార్ ముస్లింల ఇళ్లను కూల్చి వారికి గూడులేకుండా చేసిందన్నారు. మైనార్టీల కోసం ఎన్నికల ప్పుడు హామీలు గుప్పించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటి అమలు ను పట్టించుకోవడంలేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కు బుద్ధిచెప్పాలని మహమూద్‌అలీ, తలసాని, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మైనార్టీలను కోరారు.

## పెన్షన్ డబ్బుల కోసం కిరాతకం

### తల్లిని బండరాయితో మోది హత్య

**నిజామాబాద్, జూలై 10 :** పింఛన్ డబ్బుల కోసం తల్లిని ఓ దుర్మార్గ కుమారుడు హత్య చేసాడు. ఈ సంఘటన నిజామాబాద్ జిల్లాలోని వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మోస్రా మండలం జలాల్పూర్ గ్రామానికి చెందిన గొల్ల సాయవ్వ (57) కుమారుడు గొల్ల సాయిలు తల్లి పింఛన్ డబ్బుల విషయంలో గొడవ పడి డబ్బుల ఇవ్వకపోవడంతో తల్లిని బండరాయితో తల, ఛాతి, కడుపు మీద బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన చుట్టుపక్కల కాలనీవాసులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సాయవ్వను బోధన్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి వైద్యులు పరీక్షించగా ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి చెల్లెలు కొడుకు జెట్టి మహేష్ పోలీసులకు ఫిర్యాదు మేరకు వర్ని ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

### మూడు గేట్లు ఎత్తి నీటి విడుదల

**శ్రీశైలం, జూలై 10 :** కృష్ణ బేసిన్‌కు వరద ప్రవాహం యధావిధిగా కొనసాగుతుంది. శ్రీశైలం జలాశయానికి 1,62 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుండగా శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన ఉన్న జూరాల12 సుంకేసుల ప్రాజెక్టు 13 గేట్లను ఎత్తి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంనకు లక్ష అరవై వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ మూడు గేట్లను ఎత్తి దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టు వైపుకు 81 వేల క్యూసెక్కులు కుడి ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 67 వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో నాగార్జునసాగర్ కు మొత్తం 1లక్ష 48 వేల క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. ఎగువ కర్ణాటక మహారాష్ట్ర ను కురుస్తున్న వర్షాలకు జూరాల ఎగువన ఉన్న అలమట్టి నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో సాగుతుంది. నారాయణపురం డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు ఒక లక్ష పదివేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నడంతో 12 గేట్ల ఎత్తి శ్రీశైలం వైపుకు వెళుతున్నారు. జూరాలలో ఎగువ దిగువ విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి అనంతరం మరో 29వేల కేశకులను వదులుతున్నారు. సుంకేసుల బ్యారేజ్ కి ఎక్కువ తుంగభద్ర నది నుంచి 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 13 గేట్లను ఎత్తి దిగువ శ్రీశైలం వైపుకు 52 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుపై ఆధారపడిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 1600 కి శక్తుల నీరు ఎత్తిపోస్తుండగా... రాయలసీమకు పోతిరెడ్డిపాడు ద్వారా 20వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంలో 215 టీఎంసీలకు గాను ప్రస్తుతం 202 టిఎంసిల మేర నీరు నిలువ ఉంది. అడుగులలో 885 అడుగులకు గాను 882.70 అడుగులలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో ఇంతే స్థాయిలో నీటిని నిలువ ఉంచుతూ శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహానికి అనుగుణంగా గేట్లు- తెరుస్తూ మూస్తూ వస్తున్నారు. గురువారం మూడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. మరో వారం రోజుల పాటు ఇదే మోతాదులో కృష్ణా బేసిన్ కు వరద కొనసాగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## భార్యను తొక్కి చంపేసిన కిరాతకుడు

**బెంగళూరు, జూలై 10 :** ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దారుణానికి తెగించాడు. తన భార్య మెడపై కాలుతో తొక్కి చంపేశాడు. ఈ సంఘటన బెంగళూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనివాసపూర్‌లో పద్మజ- హరీష్ కుమార్ అనే దంపతులు నివసిస్తున్నారు. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తుండగా భార్య ఓ ప్రైవేటు- కంపెనీలో జాబ్ చేస్తోంది. హరీష్ గత కొన్ని నెలల నుంచి జాబ్ మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. దంపతుల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. షాపింగ్‌కు వెళ్లొచ్చిన భార్యతో భర్త గొడవకు దిగాడు. దంపతులు మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో భార్య గొంతునులిమిన నెట్టేశాడు. ఆమె కిందపడిన వెంటనే మెడపై కాలుతో తొక్కడంతో ఊపిరాడక భార్య ఘటనా స్థలంలోనే చనిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



## గురుగ్రామ్‌లో కుంభవృష్టి

### రహదారులు జలమయం.. ఇంటికే పరిమితమైన జనం

**న్యూఢిల్లీ, జూలై 10 :** భారీ వర్షాలతో గురుగ్రామ్ జలమయం అయింది. పలు ప్రాంతాలలో మోకాలి లోతు నీళ్లు నిలిచాయి. దీనితో వేలాది మంది ఇళ్లకు పరిమితం కావల్సి వచ్చింది. గురువారం గురుగ్రామ్‌లో అధికారులు జాగ్రత్త చర్యలకు సూచనలు వెలువరించారు. కార్పొరేట్ ఆఫీసులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు ఇంటి నుంచే పనికి దిగారు. ఈ ఆకాశహార్మాల నగరంలో అనేక చోట్ల నీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ ఆగింది. నగరపు దక్షిణ ప్రాంతపు రహదారిపై బీరు సీసాలతో వెళ్లుతున్న ట్రక్కు గుంతలు పడ్డ రోడ్డులో కూరుకుపోయింది. దీనితో బీరు బాటిల్స్‌ను రక్షించుకునేందుకు డ్రైవర్ ప్రయత్నించాల్సి వచ్చింది. ఘటనలో ఎవరూ గాయపడలేదు. ప్రాంతానికి చేరుకున్న క్రేన్ సాయంతో అతి కష్టం మీద ట్రక్కును పైకి లాగారు. పలు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. కొన్ని ప్రైవేటు- విద్యాసంస్థలు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాయి. బుధవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వర్షం ఆరంభం అయింది. రాత్రింతా పడుతూనే ఉంది. 12 గంటల వ్యవధిలో నగరంలో 133 మిమిల వర్షపాతం రికార్డు అయిందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతానికి ఐఎండి ఆరంజ్ అలర్ట్ వెలువరించింది. ఇక్కడి జాతీయ రహదారులలో ఆరు ఏడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయింది. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సరిగ్గా పనిచేయడం లేదని, అందుకే పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయని నగర ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్థితిని తెలిపే ఫోటోలను పెట్టారు. హర్యానాలోని ఇతర ప్రాంతాలు అంబాలా, హిసార్, కర్నాల్ , రొహతక్ , భివానీలలో కూడా భారీ వర్షాలు పడ్డాయని అధికారులు తెలిపారు.

## సంపాదకీయం

# జనాభా నియంత్రణ తక్షణావశ్యకత!



ప్రతి ఏటా జూలై 11వ తేదీన 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు. ప్రపంచ జనాభా ఇప్పటికే 800 కోట్లు దాటింది. భారతదేశ జనాభా అధికారికంగా 140కోట్లకు చేరుకుంది. ఇందులో పెరుగుదలే తప్ప తక్కు ఉండదని చెప్పొచ్చు. జనాభా పెరుగుదలతో పాటు కనీస వసతులు, వనరులు లేకపోవడంతో భారతదేశం ఇంకా పేదరికంలోనే మగ్గుతోంది. ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలకు, తరుగుదలకు సంబంధించిన విషయాల గురించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకుగాను ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించింది. జనాభా నియంత్రణ అన్నది ఎవరికి వారు నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. ఆయా దేశాలు తమ దేశాల వనరుల ఆధారంగా నియంత్రణ చర్యలు పాటించాలి. నియంత్రణ లేకపోవడంతో ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగి పోతున్నది. పెరిగిన జనాభా వలన పలు ప్రపంచ దేశాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపా యాలు కల్పించ లేక సతమతమ వుతున్నాయి. విద్య,వైద్యం,ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయి. పెరుగుతున్న జనాభా కారణంగా కనీస వసతుల కల్పన ఏ ప్రభుత్వాని కైనా తలకుమించిన భారంగా మారుతోంది. గృహకల్పన, అక్షరాస్యత, నిరుద్యోగం, పౌష్ఠికాహారం, ఉద్యోగ కల్పన వంటి అంశాలు విషమ సమస్యలుగా మారాయి. ప్రకృతి వైపరీత్యాలతో అనేక దేశాలు సతమతమవు తున్నాయి. చాలా దేశాల్లో ఈనాటికీ కనీస విద్య గగకుసుమంలా మారింది. ఆహార సమస్యతో అనేక దేశాలు అలమటిస్తున్నాయి.

మనదేశంలో త్వరలోనే జగనగణన జరుగనుంది. ఈ క్రమంలో ఈ వానాకాల పార్లమెంట్ సమావేశంలో మన ప్రతినిధులు దీనిపై చర్చించాలి. ఇప్పటికే 140 కోట్లకు జనాభా చేరుకున్న క్రమంలో జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి. లేకుంటే భారతదేశ వనరులు బతకడానికి సరిపోవు. జనభా నియంత్రణపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చైనాలాగా జనాభా నియంత్రించకపోతే రానున్నరోజుల్లో బతకడం దుర్లభంగా మారనుంది. చాలా దేశాలు దీన్ని పట్టించుకోక పోవడం వల్ల అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. జన విస్ఫోటనంతో ఎన్ని రకాల విపరీత పరిణామాలు జరగాలో అన్నీ జరుగుతన్నాయి. పర్యావరణ విపరీత పరిస్థితుల కారణంగా అధిక వర్షాలు లేదా, అస్సలు వర్షాలు పడక పోవడం, వనరులన్నీ తగ్గిపోవడం వంటి విపరీత పరిణామాలు చూస్తున్నాం. ఆహారధాన్యాల కొరత ఏర్పడనుంది. ప్రకృతి విధ్వంసం జరిగింది. ఆరోగ్యాలు దెబ్బతింటున్నా యి. ఇలా ఎన్నో విపరీత పరిణామాలు చూస్తున్నాం. అవన్నీ అనుభవ ంలోకి స్తున్నాయి. ఎన్ని దుష్ప్రభావాలు కలగాలో కలుగుతున్నాయి. ఉన్న వనరుల విధ్వంసం జరిగింది. జనాలకు సరిపడా ఆహారధాన్యాలు అందడం లేదు. పంటలు తక్కువ.. తినేవారు ఎక్కువయ్యారు. నిరుద్యో గం తాండవిస్తోంది. నానాటికి ప్రపంచంలో జనాభా పెరుగుతోంది. నానాటికి పెరుగుతున్న జనాభా..తద్వారా తలెత్తే దుష్పరి ణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు పూనుకోవాలి. పల్లెలు, పట్టణాలు, నగరాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. హోటళ్ళు, సినిమా హాళ్ళు, షాపింగ్ మాల్స్, కూరగాయల మార్కెట్లు, హాస్పటల్స్.. ఇలా ఒకటేమిటి బ్యాంకుల నుండి బట్టల దుకాణాల వరకు ఎక్కడ చూసినా జనం. ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో ప్రతీ ప్రాంతం కిటకిటలాడుతున్నది. దీంతో నివాస స్థలాలు కూడా భారంగా మారయి. ఇల్లు అందరికీ హక్కు అన్నది పోయి అదో కలగా మిగిలింది. అగ్ర రాజ్యాలు సైతం ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి... అన్నింటికి మించి ఆరోగ్య రంగంలో ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రపంచంలోని అనేక దేశాలు వెనుకబడి ఉన్నాము. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సహస్రాబ్ది లక్ష్యాలను కూడా చేరుకోలేదు. అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యానికి ఇంకా దూరంగా వుండడానికి అధిక జనాభాయే కారణం.

అయితే కొన్ని అంశాలలో అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని చెప్పుకుంటున్నా...నేటికీ సామాన్యులకు అది కలగానే మిగిలింది. ఫార్మా, వ్యాక్సిన్ల రంగాల్లో ముందంజ వేస్తున్నా..జనాభాకు సరిపడా అందించలేని దుస్థితిలో ప్రపంచం ఉంది. మొత్తం మీద అధికా జనాభా ప్రధానంగా ఆరోగ్యరంగం అసమానతలకు కారణంగా మారింది. ఆధునిక జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మూడు ప్రధాన సమస్యలు మానవాళిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రక్తపోటు, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలు కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. కేవలం పని ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయన్నది సుస్పష్టం. సరైన ఆహారం తీసుకోకపోవడం, చిన్నారులు ఎక్కువగా ఎలక్ట్రానిక్ పరికరాలకు అలవాటు పడడం కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో ఊబకాయం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీని కారణంగా ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయం అనేది చిన్న సమస్య కాదని, ఇది ఒక వ్యాధిగా వృద్ధి చెందుతుందని చెప్పింది. స్థూలకాయం అంటే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉండట మని నిర్వచించారు. ఆకలిని అధిగమించేందుకు అడ్డమైన గడ్డీ తినడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వారికి సకాలంలో వైద్యం అందించాలన్నా ఖరీదుగా మారింది. ప్రపంచంలో జనాభా పెరుగుదలను కట్టడి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వాలు లేకపోవడం ఈ దారుణానికి కారణంగా చూడాలి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పెరుగుతున్న జనాభాతో వనరులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది సకాలంలో చర్చించాల్సిన అతిపెద్ద సమస్యగా చూడాలి. జనాభా పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా వాటంతట అవే పెరుగుతాయని గుర్తించాలి. ప్రతి కుటుంబం తమకు తాముగా జనాభా నియంత్రణకు కట్టుబడాలి. ప్రభుత్వాలు జనాభా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేయాలి. లేకుంటే మరో పదేళ్లలో ఈ సమస్యను పరిష్కరిచలేని దశకు చేరుకోగలం.

# నదీజలాల సద్వినియోగంపై చర్చించాలి!

- పరస్పర అవగాహనతో కార్యాచరణ
- వృధా నీటిపై చర్చలతోనూ సత్ఫలితాలు



**అమరావతి/హైదరాబాద్, జూలై 10:** ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించుకోవడం, నిర్వహించుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ద చూపాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వాననీటిని వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రణాళికలు సిద్ధంచేయాలి. ఇటీవల కృష్ణా,గోదవారి బోర్డుల్లో పరస్పర ఫిర్యాదులతో నీటి పంచాయితీలను కొనసాగించారు. తాజాగా బనకచర్ల పేరుతో పంచాయితీ మొదలయ్యింది. ఇలా ఎవరిక వారు కాకుండా, కలసి నదీజలాల సద్వినియోగంపై ఇరు రాష్ట్రాలు చర్చించాలి. ఉమ్మడి ప్రయోజనాలు ఆశించాలి. పరస్పర నిందలతో లాభం లేదని గుర్తించాలి కృష్ణ, గోదావరిల నుంచిచుక్కనీరు సముద్రంలో కలవకుండా చూసుకోవాలి. అంతేత్వ రాజకీయప్రయోజనాల కోసం పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడం తగదు. ఇది వాంఛనీయం కూడా కాదు.

### పరస్పర అవగాహన అవసరం

ఇటీవల మరోమారు తెలుగు రాష్ట్రాల సిఎంలు కూర్చుని విభజన సమస్యలను ప్రస్తావించారు. పరస్పర అవగాహనతో ముందుకు పోతామని ప్రకటించారు. అదే సందర్భంలో జలవనరుల వినయంలో పరస్పర అవగాహన అవసరం. సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావం ఉండాలే తప్ప రెచ్చగొట్టే విధానాలు సరికాదు. విపక్షాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పరిస్థితి రాకుండా చూడాలి. ఉభయ ప్రభుత్వాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకుని ఇటు రాయలసీమ అటు తెలంగాణలోని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ఇందులో ప్రదానంగా గోదావరి, కృష్ణాల నుంచి వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని వినియోగించడంపై నిపుణులతో చర్చించాలి.

### సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి

విభజనకు ముందువరకు కలసి వున్న మనం ఇప్పుడు జగడాలు పడడం తగనిపనిగా పాలకలు, రాజకీయ పార్టీలు, నేతలు గుర్తించాలి. సమస్యలను ఎగదోసే రాజకీయ పార్టీల నేతల తీరును ఎండగట్టాలి. పొరుగు రాష్ట్రాలతో గొడవలు వద్దనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఈ విషయంలో హుందాగానే ఉంటున్నందున సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి. తెలంగాణ మంత్రులు కూడా సంయమనంతో సమస్యలను చర్చించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో మన బంధాలు బలపడాలి. ప్రభుత్వాలు తమ వాటా నికర జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప భావోద్వేగాలు రెచ్చ గొట్టడం వాంఛనీయం కాదు.

### ఘర్షణల వల్ల నష్టపోయేది తెలుగు ప్రజలే..

నిజానికి కృష్ణా,గోదావరి చివరి బేసిన్‌లో ఉన్నవి తెలుగు రాష్ట్రాలే. ఈ రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాల అన్నది నిర్ణయించుకోవాలి. దీనిద్వారా ఇరు రాష్ట్రాల రైతాంగం బాగుపడుద్ది. సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రాజెక్టులను నిర్మించుకునే అవకాశాలను పరిశీలించాలి. ఘర్షణల వల్ల నష్టపోయేది రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలే అని గమనించాలి.కేంద్రం కూడా బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కానరావడం లేదు. సమస్యలను పెద్దవిగా చేయకుండా పరిష్కరించే మార్గాలను చూపుతూ శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టగలగాలి. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నది కిందనున్న ప్రాజెక్టులకు ఇప్పటికే నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్రలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఉభయ తెలుగు రాష్ట్రాలకు మిగులు జలాలు కాదుకదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలకు కూడా గ్యారంటీ ఉండదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణాజలాల్లో తమ వాటాగా ఉన్న నికరజలాలకు గ్యారంటీని పొందడంతో పాటు బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్ధతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును తెలుగు రాష్ట్రాలు కాపాడు కోవాలి. ఇందు కోసం ముందుగా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, అవగాహన ఉండాలి. ఇరు రాష్ట్రాలు ఉమ్మడిగా కేంద్ర పెత్తనాన్ని ఎదుర్కోవలసి ఉంది. ఎవరివాటాలను వారు వాడుకునే విధంగా నడుచుకోవాలి. వివాదాన్ని కేంద్రమే పరిష్కరించాలని కోరడమనేది శత్రువుకు జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. నీటి సమస్యలు భావోద్వేగాలను తీవ్రతరం చేయడం సరికాదు. అనేక సమస్యలను పరిష్కరించ లేని కేంద్రం ఇక జల వివాదాలను సరిదిద్దుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల ఉన్న ఒప్పందాల మేరకు నడుచుకునే విధంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూర్చుని మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పోతిరెడ్డిపాడు నుంచి కిందకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే శ్రీశైలంలో 881 అడుగులు నీళ్లు ఉండాలి.

### రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి

శ్రీశైలంలో పూర్తి నీటి మట్టం 885 అడుగుల నీళ్లు ఉన్న రోజులు గత 20 ఏళ్లలో ఏడాదిలో 20 నుంచి 25 రోజులు కూడా లేవు. ఇలాంటి సమయంలో పోతిరెడ్డిపాడుకు పూర్తి స్థాయిలో నీటిని తీసుకెళ్లలేని పరిస్థితి. మరోవైపు పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు, కల్వకుర్తి సామర్థ్యం పెంచి 800 అడుగులలోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉందంటున్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 800 అడుగుల్లోపు లోనే మీకు కేటాయించిన నీటిని వాడుకుంటే తప్పులేనప్పుడు.. 881 అడుగులు ఉంటే తప్ప నీళ్లు వాడుకోలేని పరిస్థితి మాకున్నప్పుడు.. మేం 800 అడుగుల వద్దే మాకు కేటాయించిన నీటిని తీసుకోవడంలో తప్పేముందని ఎపి అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ విషయాలపై స్పష్టత రావాలి. అలాగే రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి. ఈ క్రమంలో నదీ జలాల పంపిణీ, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత లోతుగా చర్చలు సాగాలి. నిజానికి సమస్య ఎక్కడుందో ఆలోచించాలి. ప్రజలకు తాగునీరు, సాగు అవసరాలు, జల విద్యుత్తు, పారిశ్రామిక అవసరాలు... ఇలా నీటి వినియోగ ప్రాధాన్యతలు అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆయా నియమాలను పాటిస్తూ, ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే సర్దుబాటు చేసుకొని పరస్పరంగీకారంతో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించుకోవాలి. అప్పుడు కృష్ణా, గోదావరుల్లో మనకు ఉన్నంత నీరును సద్వినియోగం చేసుకోవచ్చు.

# రుణంపైనే ఆధారపడ్డ రైతన్నలు

### సకాలంలో రుణాలు అందక తంటాలు




**కరీంనగర్, జూలై 10:** పంటరుణాల పంపిణీలో జగిత్యాల జిల్లాలో కనీసం 50శాతం మంది రైతులకు కూడా చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు పంటరుణ పరిమితి అమలు లేకపోగా నిబంధనల ప్రకారం పంటరుణం తీసుకునే ప్రతిరైతుకు కిసాన్ క్రెడిట్ కార్డును ఇవ్వాలి. రైతు ఖాతాలో బ్యాంకర్లు రుణం నిధులను జమచేసిన తరువాత రైతు వాడుకున్న మొత్తానికే వడ్డీ చెల్లించాలి. రైతుకు ఒకేసారి నిధులు అవసరం ఉండవు. పంట సాగునుంచి చివరి వరకు దఫాలుగా నిధులు అవసరం ఉంటాయి కాబట్టి ఖాతాలో నుంచి కార్డుద్వారా అవసరం ఉన్నపుడు తీసుకుని తిరిగి ఖాతాలో జమచేసే వీలుండాలి. దీనివల్ల రైతులకు ఎప్పుడూ నిధులు అందుబాటులో ఉంటాయి, వడ్డీ తగ్గుతుంది. పంటకాలంలోనైనా తమకు పంటరుణాలు దక్కుతాయని అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండగా వీరికి ప్రభుత్వం అందించే పంట రుణాలే ఆధారం కానున్నాయి. గతకొన్ని సీజన్లుగా పంటరుణాల పంపిణీ లక్ష్యానికి దూరంగానే నిలిచిపోతుండగా కౌలు రైతులకు సైతం పంటరుణాల పంపిణీ దరిచేరడం లేదు. రైతులకు ఒకేసారి రుణమొత్తాన్ని చెల్లించి ఒకేసారి వసూలు చేస్తున్నారు. మరోవైపు పంటరుణ పరిమితి ఒక్కో పంటకు ఒక్కో రకంగా ఉంటున్నా ఈ పరిమితి మేరకు ఇవ్వడం లేదు. జిల్లాలో జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులుండగా వీటిద్వారా రైతులకు రుణాలను అందిస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లో పంటరుణాల మంజూరు, రెన్యూవల్స్ రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. మరోవైపు జిల్లాలో కౌలురైతులుంటారు కాబట్టి వీరికి కూడా వచ్చే వానాకాలం పంటరుణాన్ని దరిచేర్చేలా చర్యలు ఒడాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినపుడే రైతులకు పంటరుణాల పంపిణీ లక్ష్యం నెరవేరుతుంది. రైతులకు పంట రుణంతో పాటుగా స్వల్ప, దీర్ఘకాలిక, భూమి అభివృద్ధి, బావుల తవ్వకం, మోటార్లు, పైపు లైన్లకు కూడా రుణాలను మంజూరివ్వాల్సి ఉంటుంది.

## పురోగతిలో అమెరికాతో
# వాణిజ్య చర్చలు

### వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్

**న్యూఢిల్లీ, జూలై 10:** అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయని వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గురువారం తెలిపారు. భారతదేశం-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అగర్వాల్ ముఖ్య సంధానకర్తగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపారు. త్వరలోనే ఒక కొలిక్కి అవకాశం ఉన్నట్లు- కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ గడువు జూలై 9తో ముగిసిపోయింది. అయితే కొన్ని దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు పొడిగించారు. అయితే అమెరికా.. భారత్‌లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై మినహాయింపులు కోరుతోంది. ఈ రెండు కూడా భారతదేశంలో చాలా సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సందిగ్ధంలో పడ్డాయి. తాజాగా ఇదే అంశంపై గురువారం రాజేష్ అగర్వాల్ స్పందించారు. ఎగుమతి లాజిస్టిక్స్‌పై జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ వాణిజ్య ఒప్పందాలపై మాట్లాడారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారతదేశం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ ఒప్పందం యొక్క మొదటి దశను సెప్టెంబర్-అక్టోబర్ నాటికి ముగించడానికి లక్ష్యంగా పెట్టు-కున్నట్లు- చెప్పారు. భారతదేశం ఇప్పటి వరకు 26 దేశాలతో 14కి పైగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అమలు చేసిందని అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం ప్రధాన మార్కెట్లతో అనుసంధానం అవుతున్నామని.. ఇప్పటికే యూకేతో ఒక ఒప్పందాన్ని ముగించినట్లు పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో కూడా చర్చల దశలో ఉన్నట్లు తెలిపారు.




# పన్ను వసూళ్లలో నెరవేరని లక్ష్యం

### ఉద్యోగుల నిర్లక్ష్యంతో దక్కని ఫలితం

**హైదరాబాద్, జూలై 10:** పన్నులపై వడ్డీలమీద వడ్డీల భారం పడడంతో, ఇంటిపన్నుల వసూళ్లు మందగించాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇంటిపన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణాలు విస్తరించడం, కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డా ప్రజల ఆదాయవనరులు పెరగడం లేదు. దీంతో పట్టణాల్లో వ్యాపారాలు చితికి పోతున్నాయి. పురపాలికలు రోజు రోజుకు విస్తరిస్తుండగా, ఆ మేరకు ఆదాయం రావడం లేదు. పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు ఓవైపు మాల్స్, వ్యాపార సముదాయాలు, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగడం లేదని అంటున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాల విషయంలో కొందరు అద్దె చెల్లిస్తుండగా, మరికొందరు పెండింగ్‌లో పెట్టడంతో మునిసిపల్ ఆదాయం దెబ్బతింటోంది. లీజుకు తీసుకున్న వారు పెద్ద మొత్తంలో సబ్ లీజుకు దుకాణాలను ఇచ్చుకుంటున్నారు. దీనివల్ల కూడా రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. మునిసిపాలి టీకి పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. పన్ను వసూళ్ళలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల మునిసిపాలిటీకి రావాల్సిన మేర ఆదాయం రావడం లేదని తెలుస్తోంది. మాల్స్, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు విస్తరిస్తుండటంతో పట్టణం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు సమకూర్చాలంటే పన్నుల రూపంలో ప్రజలు ఆదాయం చెల్లించాల్సి ఉంది. అధికార యంత్రాంగం నిర్లిప్తత, కింది స్థాయి ఉద్యోగుల ఉదాసీనత కారణంగా సరైన అస్సెస్‌మెంట్ చేయకపోవడం వల్లే పట్టణం పరిగినంత వేగంగా ఆదాయం పెరగడం లేదని తెలుస్తోంది.

# కల్తీకల్లు బాధితులకు 10లక్షల పరిహారం ఇవ్వాలి

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు డిమాండ్

**హైదరాబాద్, జూలై 10:** కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, బాధితులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్తీ కల్లు ఘటనలో అనధికారికంగా ఆరుగురు మృతి చెందారు. ఒకటి రెండు సీసాల కల్లు తాగిన వారి కిడ్నీలు దెబ్బతిన్నాయి. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్టు- స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఘటన మొదటిసారి కాదు.. గతంలోనూ వెలుగు చూశాయి. అధికారులు రోజూ కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంచర్యలు తీసుకోవాలి' అని రామచందర్‌రావు అన్నారు.

## మరోమారు యశోదాలో చేరిన కేసీఆర్



**హైదరాబాద్, జూలై 10 :** మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ మరోమారు ఆస్పత్రిలో చేరారు. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో వైద్యపరీక్షల కోసం చేరారు. వైద్యుల సూచన మేరకు ఆయన అడ్మిట్ అయ్యారు. కేసీఆర్‌కు మరోసారి డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ నెల 3న కూడా ఆయన యశోద ఆసుపత్రిలో చేరారు. అప్పుడు బ్లడ్ షుగర్, సోడియం స్థాయులు మానిటర్ చేయడానికి రెండ్రోజులు ఆసుపత్రిలోనే ఉండాలని వైద్యులు సూచించారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఈనెల 5న డిశ్చార్జి అయ్యారు. వారం రోజుల పాటు- విశ్రాంతి తీసుకోవాలని, తర్వాత తర్వాత పరీక్షలు చేయాల్సి ఉంటు-ందని డిశ్చార్జి సమయంలో వైద్యులు తెలిపారు. ఈక్రమంలో వైద్య పరీక్షల కోసం కేసీఆర్ మళ్లీ యశోద ఆసుపత్రిలో చేరారు. కెసిఆర్ వరుసగా ఆస్పత్రిలో చేరడంపై బిఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



## మల్నాడు డ్రగ్ పార్టీ కేసులో
# దర్యాప్తు ముమ్మరం

### 9 పబ్స్‌పై కేసులు నమోదు.. నోటీసులు జారీ

**హైదరాబాద్, జూలై 10:** మల్నాడు రెస్టారెంట్ డ్రగ్ పార్టీ కేసులో ఈగిల్ టీమ్ దర్యాప్తును ముమ్మరం చేసింది. 9 పబ్స్ పైన ఈగల్ కేసులు నమోదు చేసింది. ఇప్పటికే, పబ్బుల యజమానులకు నోటీసులు జారీ చేసింది. వచ్చే వారం తమ ఎదుట హాజరు కావాలని పబ్బు యజమానులకు నోటీసులు అందజేశారు. మల్నాడు రెస్టారెంట్ సూర్యతో ముగ్గురు పబ్ యజమానులతో సంబంధాలు ఉన్నట్లు- సమాచారం. మూడు పబ్స్ యజమాలతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లుగా ఈగల్ టీమ్ గుర్తించింది. అయితే, పబ్బుల్లో డ్రగ్స్ పార్టీ కోసం ప్రిజం పబ్, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్ పబ్, బ్లాక్ 22 పబ్, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్స్ కు చెందిన యాజమాన్యాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. అయితే, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్, బ్రాడ్ వే యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్వాక్ పబ్ రాజా శేఖర, కోరా పబ్ పృధ్వి వీరమాచినేని, బ్రాడ్ వే పబ్ ఓనర్ రోహిత్ మాదిశెట్టిలపై కేసు నమోదు చేసినట్లు- తెలిపారు. ఈ ముగ్గురు పబ్బు యజమానులతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లు- సూర్య పేర్కొన్నారు.



## ఎయిమ్స్‌లో జర్నలిస్టులకు హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

**ఎంపీ చామలకు వినతి పత్రం అందజేసిన టిజెయు జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా**

**భువనగిరి రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో ఉన్నా ఎయిమ్స్ హాస్పటల్లో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం హెల్త్ వెల్నెస్ సెంటర్ను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ఆధ్వర్యంలో భువనగిరి లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి హాస్పిటల్ లో జర్నలిస్ట్ లకు హెల్త్ వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వారితోపాటు తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## ఆయిల్ ఫామ్ మొక్కలను నాటిన బీర్ల ఐలయ్య

**ఆలేరు రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో వన మహోత్సవం లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావు, ముఖ్యఅతిథిగా హాజరై అయిల్ ఫామ్ మొక్కలును నాటారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ ఉద్యాన పట్టు పరిశ్రమ, తెలంగాణ రాష్ట్ర నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రైతులు లాభసాటి వ్యవసాయం కోసం అయిల్ ఫామ్ సాగుచేయలన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అగ్రికల్చర్ మినిస్టర్ తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి నేతృత్వంలో రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఐదు సంవత్సరాల తర్వాత ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం రైతులకు అందుతుందని అన్నారు. సంప్రదాయ పంటలే కాకుండా ఇతర పంటలను కూడా రైతులకు పరిచయం చేసి పండించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## ఆయిల్ ఫెడ్ చైర్మన్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**ఆలేరు రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గురువారం రోజున ఆలేరు రహదారి బంగ్లాలో తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ని, ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం ఏ ఎజాజ్, ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ చింతలఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి, పి ఎ సి ఎస్ డైరెక్టర్ కట్టే కోమ్ముల సాగర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గిడి యాదగిరి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎమ్మెస్ విజయకుమార్, నాగిళ్ల కర్ణాకర్ రెడ్డి, ముదిగొండ శ్రీకాంత్, సంతోష్, అనిల్, కాసుల భాస్కర్, ప్రకాష్ రెడ్డి, దశరథ, దూసరి మురళి, సిద్ధులు, మొదలగు వారు పాల్గొన్నారు.



## పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**- డిప్యూటీ తహసిల్దార్‌కు జర్నలిస్టుల వినతి**

**ఆలేరు రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం లోని పాత్రికేయులకు ఇండ్ల పట్టాలు, ఇచ్చినప్పటికిని, ఇండ్ల స్థలాలు చూపించడంలో రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆలేరు ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ కుర్షిత్ పాషా, కొరుటూరి ఉపేందర్ లు అన్నారు. గురువారం ఆలేరు రహదారి బంగ్లాలో జరిగిన ప్రెస్ క్లబ్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. స్థానికంగా పనిచేస్తున్న జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలతో పాటు, ఇందిరమ్మ ఇళ్లను నిర్మింపజేసి ఇవ్వాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై, దృష్టి సారించి పాత్రికేయులకు న్యాయం చేయాలని కోరారు. జర్నలిస్టులపై రోజు రోజుకు జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని, దాడి చేసిన వారిపై చట్ట పకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం స్థానిక డిప్యూటీ తహసిల్దార్ ప్రదీప్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ నాయకులు తోట మల్లయ్య, ముల్లెక్కల రవికుమార్, వంగరి శివకుమార్, చింతకింది వెంకటేష్, మహమ్మద్ జహంగీర్, సిరిగిరి స్వామి, మంచన మల్లేశం, బోడ నరేష్, సిద్దార్థ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** విద్యార్థుల కు నాణ్యమైన విద్యా బోధన అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉపాధ్యాయులకు ఆదేశించారు. గురువారము వికారాబాద్ మండల పరిధిలోని గొట్టి ముక్కుల గ్రామములోని అంగన్వాడి సెంటర్ ను, జిల్లా పరిషత్ హై హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడి సెంటర్లో పిల్లలు ఎంతమంది ఉన్నారు, ప్రతి రోజు సెంటర్ కు వస్తున్నారా, పిల్లలకు గుడ్లు, పాలు ఇస్తున్నారా, బాలమృతం ఫ్లష్ ఇస్తున్నారా, వికలాంగులు, తీవ్ర మైన, అతితీవ్రమైన పోషక లోపం ఉన్న పిల్లలు ఎంత మంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిష్టర్ ను పరిశీలించారు. పిల్లల కు యునిఫామ్స్ వేసి, చార్ట్ పై రాసి పిల్లల్లతో చదివించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లో చదువుతున్న పదవ తరగతి, ఎనిమిదవ తరగతి క్లాసు రూమ్ లను పరిశీలించి విద్యార్థిని, విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. ఇంగ్లీష్ , హింది సబ్జెక్టుల వారీగా వివరాలు అడిగి తెలుసుకొని, ఇంగ్లీష్ పై పట్టు ఉండాలని, విద్యార్థులకు ఇంగ్లీష్ చెప్పి పోయెమ్స్ చదివించారు. ఈ సందర్భంగా 8 వ తరగతి విద్యార్థులకు (ఐఎఫ్‌పి) ఇంటరక్టివ్ ప్లాట్ పన్నెల్ ద్వార విద్యార్థులకు ఉపాద్యాయుడు బోధిస్తున్న విధానాన్ని వీక్షించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని పోటీతత్వంలో ముందుకు వెళ్లాలని అన్నారు. మీరు మంచిగా చదువుకోని మీ తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో కలిసి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉండే గదులను, మరుగు దొడ్లను కలెక్టర్ పరిశీలించారు. వంట గది ని, కొత్తగా నిర్మాణమైన డైన్నింగ్ హాలుని పరిశీలించి, వంట తయారు చేసే విధానాన్ని స్వయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి, స్టోర్ రూం లో ఉన్న బియ్యం ను, వంట సరుకులను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారము బోజనము అందించాలని అన్నారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థుల యొక్క హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ప్రతి విద్యార్థి ఈ సంవత్సరం మెరిట్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిమౌళిక వసతులు కల్పించాలన్నారు , పాఠశాలలలో పెండింగ్ పనులు వుంటే త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఎం ఇ ఓ బాబు సింగ్, ప్రదాన ఉపాద్యాయుడు శివ కుమార్, అంగన్వాడి టీచర్ లక్ష్మి, తదితరలు ఉన్నారు.

## అక్రమ పట్టా చేసుకొని గోస పెడుతుండు

- ఓ మాతృమూర్తి ఆవేదన..!
- అధికారులు న్యాయం చేసేనా..?



**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** తాను సంపాదించిన భూమిని తన కొడుకు అక్రమంగా పట్టా చేసుకున్నాడని, ఆ భూ పట్టాను రద్దు చేయాలని ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన జుర్రు కొమురమ్మకు పోచయ్య, సంపత్, లింగయ్య ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు సంపత్ గ్యాస్ కనెక్షన్ కోసమని కొమురమ్మను తీసుకువెళ్లి 7 గుంటల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడు. ఈ విషయమై గత కొన్ని సంవత్సరాల నుంచి వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అధికారులు ఇరువురిని నెల రోజుల క్రితం బైండోవర్ చేసి, కౌన్సిలింగ్ నిర్వహించారు. కాగా తాను సంపాదించిన ఆస్తి ముగ్గురు కొడుకులకు చెందుతుందని, కానీ రెండో కుమారుడు సంపత్ దానిని అక్రమంగా పట్టా చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తన గోడును మీడియాతో వెల్లబోసుకుంది. అక్రమంగా చేసుకున్న భూ పట్టాను రద్దు చేయాలని రెవెన్యూ అధికారులను కోరింది.

## సాయిబాబా ఆలయంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

- ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, ఆలయ చైర్మన్ అనిల్ సింగ్, సెక్రటరీ బొందుగుల కృష్ణారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి
- సాయంత్రం సంధ్యా సమయంలో పల్లకి సేవ నిర్వహించిన కమిటీ సభ్యులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** అష్టాదశ పురాణాలూ రచించి మానవాళికి అందించిన వేదం వ్యాసుని జన్మదినం ఆషాఢ శుద్ధ పౌర్ణమి. ఆది గురువైన వేదవ్యాసుని జన్మ దినాన్ని మనం గురుపూర్ణిమగా జరుపుకుంటామని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ అమర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని నగర పరిధిలోని 12వ డివిజన్ బుద్ధ నగర్ సాయిబాబా ఆలయంలో మాజీ మేయర్ అమర్ సింగ్ మాజీ కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, ఆలయ చైర్మన్ అనిల్ సింగ్, సెక్రటరీ బొందుగుల కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీర్జాదిగూడ నగర



ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని సాయిబాబా ఆలయం రంగురంగుల పూలతో అలంకరించారని అన్నారు. వేకువ జాము నుండే ఆలయానికి భక్తులు తండోపతండాలుగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో గురు పౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, పవిత్రమైన మనసుతో జరుపుకుంటారని తెలిపారు. హిందూ సంప్రదాయం ప్రకారం సాధారణంగా గురువును పూజించడానికి గురువారం విశేషమైనదని, ఇక గురుపూర్ణిమ గురువారం కలిసివస్తే ఇక అంతకంటే విశేషమైన రోజు మరొకటి ఉండదు. ఎప్పుడో అరుదుగా వచ్చే ఈ విశేష కలయిక ఈరోజు వచ్చిందన్నారు. సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తుల సమక్షంలో సాయిబాబా పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భక్తులు పల్లకి సేవలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా భజనలు, కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి,సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ అనిల్ సింగ్, సెక్రటరీ బొందుగుల కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, కాలనీ వాసులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనది

**భాజపా నాయకులు ఏలె చంద్రశేఖర్**

**వలిగొండ రాజముద్ర న్యూస్:** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ సభ్యులు ఏలే చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి తండ్రి తర్వాత పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేది కేవలం గురువేనని ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు గురువులు చెప్పిన విధంగా విని వారి యొక్క జీవితాలలో అత్యున్నత స్థాయిలో ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ మండల ఉపాధ్యక్షులు గంగాధరి దయాకర్, మందుల నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చు శ్రీనివాస్, మాటూరి కృష్ణ శంకర్ భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యదర్శి రేగురి అమరేందర్, కీర్తి వెంకటేశం, బుంగమట్ల మహేష్, కుంభం మహేష్, మైసోల్ల మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.



## సిద్దలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే లలితా దేవి సిద్ధలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న మౌలిక సదుపాయాలు, ఇటీవల కాలంలో పీహెచ్ సి లో చేయించిన రిపేర్ లను, ఫార్మసీ స్టోర్‌ను, ల్యాబ్‌ను, జనరల్ వార్డును పరిశీలించి వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అంతేగాక పీహెచ్‌సిలో అవుట్ పేషెంట్ గా వచ్చే వారికి అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు చేసి నాణ్యమైన సేవలు అందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పట్ల ప్రజలలో నమ్మకం పెంచే విధంగా పనిచేయాలని, ఆసుపత్రిలో ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలని, వర్షాకాలంలో తరచుగా సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




## విద్యార్థులు బడిబాట పట్టాలంటే ఆర్టీసీ ఉచిత బస్సు రావాల్సిందే

**బీబీనగర్ రాజముద్ర న్యూస్ :** తెలంగాణలో బిసి,ఎస్సి,ఎస్టీ రైట్స్, రాజ్యాధికార సాధన జేఏసి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు విద్యార్థులు బడిబాట పట్టాలంటే ఆర్టీసీ ఉచిత బస్సులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీబీనగర్ మండల తాహసిల్దార్ కి మండల బిసి,ఎస్సి,ఎస్టీ రైట్స్, రాజ్యాధికార సాధన జేఏసి ఆధ్వర్యంలో రిప్రజెంటేషన్ అందజేశారు. ఈ సందర్భంగా బిసి,ఎస్సి,ఎస్టీ రైట్స్, రాజ్యాధికార సాధన జేఏసి, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు వెలువర్తి శ్రీకాంత్ మహారాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 26 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరిలో 90 శాతం మంది విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలకు దూరంగా నివాసం ఉంటున్నారన్నారు. కాబట్టి ప్రతీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 30 మంది విద్యార్థులకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేసి విద్యార్థులను స్కూలుకు తీసువెళ్లాలని అన్నారు. దీని ద్వారా వారి సమయం, శక్తి వృధా కాకుండా ఉంటుందని, చదువుపై మరింత శ్రద్ధ పెట్టడం వల్ల ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. ఈ డిమాండ్ ను వెంటనే నెరవేర్చకపోతే త్వరలో భారీ ధర్నాకు సిద్ధమవుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ధర్మ సమాజ్ పార్టీ నాయకులు నరేష్ మహారాజ్, సంజీవ మహారాజ్, ఉపేందర్, ప్రకాష్, శ్రీరాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## యెమెన్‌లో కేరళ నర్సుకు మరణశిక్ష..

**స్పందించిన సుప్రీం ధర్మాసనం**

**న్యూఢిల్లీ :** యెమెన్‌లో వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో కేరళ నర్సు నిమిష ప్రియకు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. ఈనెల 16న ప్రియకు ఉరిశిక్ష అమలుకానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై నమోదైన పిటిషన్‌ను విచారించేందుకు తాజాగా అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. మరణశిక్ష నుంచి నిమిషను ు దౌత్య మార్గాన్ని ఉపయోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ దాఖలైంది. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. దీనిపై తదుపరి విచారణ ఈనెల 14న ఉండనున్నట్లు తెలిపింది. కాగా.. 16న మరణశిక్ష అమలు నేపథ్యంలో దౌత్య చర్చలకు కేవలం రెండు రోజులు మాత్రమే ఉంటుందని, అది ప్రభావం చూపకపోవచ్చని సీనియర్ న్యాయవాది రాజేంత్ బసంత్ పేర్కొన్నారు. కాబట్టి త్వరగా విచారణ జరపాలని కోరారు. ఈసందర్భంగా షరియత్ చట్టం ప్రకారం బాధిత కుటుంబసభ్యులకు నష్ట పరిహారం చెల్లిస్తే నిమిషను విడుదల చేయవచ్చని ఆయన ధర్మాసనానికి తెలిపారు. పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష.. నర్సు కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్‌కు వెళ్లారు. 2011లో వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకొన్నారు. యెమెన్ చట్టాల ప్రకారం.. ఆ దేశానికి చెందిన తలాల్ అదిబ్ మెహదీని ఆమె వ్యాపార భాగస్వామిగా చేసుకుంది. వీరిద్దరూ కలిసి అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ అనే సెంటర్‌ను ప్రారంభించగా.. అది కొంతకాలం సజావుగా సాగింది. భర్త, కుమార్తె కేరళకు వెళ్లిపోయాక.. నిమిష ప్రియకు మెహదీ నుంచి వేధింపులు మొదలయ్యాయి. 2017లో అక్కడినుంచి పారిపోయేందుకు ఆమె ప్రయత్నించింది. మెహదీకి మత్తుమందు ఇచ్చి, తన పాస్‌పోర్టు లాక్కోవాలని భావించింది. ఈ ప్రయత్నంలో మత్తుమందు మోతాదు ఎక్కువకావడంతో



మెహదీ చనిపోయాడు. ఈ కేసును విచారించిన కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. గత ఏడాది నిమిష తల్లి ప్రేమకుమారి యెమెన్ వెళ్లారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి తన కుమార్తెను కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అవి ఫలించలేదు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరం



- ఆమనగల్లు గ్రామపంచాయతీ పరిధిలోని రావువారి గూడెంలో ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారులతో కలిసి ముగ్గు పోసిన నాయకులు
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు పొందే అవకాశం: సందీప్

**వేములపల్లి, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి సహాయం అందించడమే ఇందిరమ్మ ఇళ్లు పథకం ముఖ్య ఉద్దేశ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సందీప్ తెలిపారు. ఈ మేరకు గురువారం వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామపంచాయతీ పరిధిలోని రావువారి గూడెంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ముగ్గు పోశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులైన పేరబోయిన సైదమ్మ భర్త ముత్తయ్య, బంటు విజయ భర్త సైదులు, లొడంగి మల్లమ్మ భర్త లింగయ్య, పేరబోయిన లావణ్య లు మొదటి విడత జాబితాలో లబ్ధి పొందారు. లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, స్థానిక మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి, స్థానిక పార్టీ నాయకులకు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేద ప్రజల ముఖాల్లో చిరునవ్వు చిందించే విధంగా ప్రజా పాలన కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు గొప్ప వరంగా ఉన్నాయని తెలిపారు. ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు పథకాలు చాలా మంచి పథకాలని తెలిపారు. ఇంటి నిర్మాణం వివిధ దశల్లో ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. పునాది పూర్తయిన తర్వాత రూ. 1 లక్ష, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. 1.25 లక్షలు, స్లాబ్ నిర్మాణ సమయంలో రూ. 1.75 లక్షలు, ఇల్లు పూర్తయిన తర్వాత మిగతా లక్ష రూపాయలు అకౌంట్ లో జమవుతాయని తెలిపారు. రెండవ విడతలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా కృషి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రావు నర్సిరెడ్డి, రావు వెంకట్ రెడ్డి, నాగయ్య, బాలకృష్ణ, స్థానిక ప్రజలు పేరబోయిన లింగయ్య, రావు లింగారెడ్డి, ఈదయ్య, పాల్గొన్నారు.







## రోడ్డు ప్రమాదాల భారీ నుండి ప్రజలను రక్షించాలి

- అదనపు కలెక్టర్, రోడ్డు భద్రత కమిటీ చైర్మన్ రాధిక గుప్తా
- కలెక్టరేట్ మినీ మీటింగ్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమావేశం
- హాజరైన పలు శాఖల అధికారులు పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు

**మేడ్చల్, రాజముద్ర న్యూస్ :** చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్మన్ రాధికాగుప్తా అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ మిని మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి అదనపు కలెక్టరు హాజరైనారు. జిల్లాలోని సమస్యాత్మకమైన, మరమ్మత్తులు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ... చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. గత సమావేశంలోని సమస్యలను ఎంత వరకు పరిష్కరించారు, ఇంకాఎన్ని పెండింగ్‌లో ఉన్నవి అని సంబంధిత అధికారులను, మున్సిపల్ ఆధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్ ను షిఫ్ట్ చేసిరోడ్డు విస్తీర్ణం పెంచాలని, రోడ్డు ఇరు వైపుల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుట్ పాత్ ఆక్రమణలను తొలగించాలని, అవసరమైన చోట స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న చిన్న మరమ్మత్తులను మున్సిపల్ కమీషనర్లు తమ వద్ద ఉన్న నిధులతో పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల పై వర్షం నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల పై ఎక్కువ ప్యాచ్ వర్క్ చేయకుండా అవసరమైన మేరకు కొత్త రోడ్లను నిర్మించాలని తెలిపారు.రోడ్ల నిర్వహణకు గాను భారీ మ-రమ్మత్తులకు, నిర్మాణలకు అవసరమైన మంజూరు అనుమతులను సంబంధిత శాఖల అధికారుల ద్వారా తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులకు పరిహారం ఎంత మందికి అందాయి, ఇంకా ఎంత వరకు పెండింగ్ లో ఉన్నవని అదనపు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు భద్రత సమస్యల పై మున్సిపల్ అధికారులకు తగు సూచనలు సలహాలను అదనపు కలెక్టరు అందించారు. జిల్లాలో రహదార్లపై ప్రమాదాలు తగ్గించడానికి ట్రాఫిక్ పోలీసు వారితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్లను అదనపు కలెక్టరు ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా రోడ్లు, భవనాల అధికారి, జిల్లా రవాణా అధికారి, ట్రాఫిక్ అదనపు డిసిపి, ఎసిపి సైబరాబాద్, కూకట్పల్లి, మేడ్చల్, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

## అధికారిక భాషా విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'దక్షిణ్ సంవాద్' స్వర్ణోత్సవం

- ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ హెూం మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేస్తున్న అధికారిక భాషా విభాగం తన స్వర్ణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. తమ విభాగాన్ని 1975 జూన్ 26న ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. స్వర్ణోత్సవ ప్రారంభ కార్యక్రమాన్ని గత నెల 26న న్యూఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. దీనికి తరువాయిగా, "దక్షిణ్ సంవాద్" వేడుకల పరంపరలో భాగంగా నిర్వహించ తలపెట్టిన ప్రధాన వేడుకకు శుక్రవారం (ఈ నెల 11న) హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. ఈ చరిత్రాత్మక కార్యక్రమం వివరాలను ప్రసార మాధ్యమాలకు తెలియజేసే ఉద్దేశంతో, అధికారిక భాషా విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ మీనాక్షీ జాలీ గురువారం హైదరాబాద్‌లోని సీజీఓ టవర్స్‌లో పత్రికా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్యక్రమం ఉద్దేశాలు, ముఖ్యాంశాలతో పాటు ఈ కార్యక్రమానికి హాజరు అవుతారని భావిస్తున్న ప్రముఖుల వివరాలను కూడా తెలియజేశారు. హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ ఈ పత్రికా సమావేశానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. మీడియాను ఉద్దేశించి డాక్టర్ మీనాక్షీ జాలీ ప్రసంగిస్తూ... 'దక్షిణ్ సంవాద్' కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా ఉంటారని తెలిపారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాల్గొంటారని ఆమె వివరించారు. దక్షిణ భారతదేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉన్నతాధికారులు, స్కాలర్లు, భాష పట్ల ఉత్సాహం కనబరచే వారు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివస్తారని కూడా డాక్టర్ మీనాక్షీ జాలీ తెలిపారు. వారిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటకలతో పాటు పుదుచ్చేరీకి చెందిన వారు ఉంటారని ఆమె చెప్పారు. స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలను ఈ వేడుకలో సత్కరించనున్నారు. భాషావ్యాప్తిని ప్రోత్సహించడంతో పాటు సాంస్కృతిక అనుబంధం పట్ల అధికారిక భాషా విభాగానికి ఉన్న అంకితభావాన్ని ఈ సత్కార ఘట్టం చాటిచెప్పనుంది.

**నేపథ్యం:** కార్యాలయ విధులలో హిందీని ఉపయోగించే ప్రాతిపదికపై మన దేశాన్ని ఏ ప్రాంతం, బీ ప్రాంతం, సీ ప్రాంతం.. ఇలా మూడు ప్రాంతాలుగా వ్యవహరిస్తున్నారు. అధికారిక భాషా విధానాన్ని సమర్ధమంతంగా అమలు చేయడానికి మద్దతిచ్చేందుకుగాను దేశవ్యాప్తంగా టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీస్ (టీఓఎల్ఐసీస్)ను ఏర్పాటు చేశారు. "దక్షిణ్ సంవాద్" కార్యక్రమం ఒక వేడుక మాత్రమే కాదు.. అంతకు మించింది. ఈ కార్యక్రమాన్ని అధికారిక భాష అమలు తీరుతెన్నులలో అయిదు దశాబ్దాలుగా చోటు చేసుకొన్న ప్రగతికి ఒక ప్రతీకగా నిర్వహిస్తున్నారు. అంతేకాదు దేశంలో భాషాపరమైన ఐకమత్యాన్ని బలపరచడంలో దక్షిణాది పోషిస్తూ వస్తున్న చురుకైన పాత్రకు ఈ వేడుక ఒక గుర్తింపుగా కూడా ఉంటోంది. భారతీయ భాషలన్నిటి మధ్య చర్చలను, సహకారాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధానోద్దేశం. ఈ ప్రక్రియలో హిందీ భాష ఒక సమన్వయకర్త పాత్రను పోషిస్తోంది. హిందీ భాష ఒక స్థానాన్ని పూర్తి చేసేదిగానో లేక ప్రత్యామ్నాయంగానో కాకుండా, మన దేశంలోని సుసంపన్న బహుళ భాషల్లో ఓ వారధిలా ఉంటోందని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పనున్నారు.

## హసీనాపై తీవ్ర నేరాభియోగాలు

### ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రైబ్యునల్

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ గురువారం అభియోగాలు మోపింది. వీటిపై ఆగస్టు 3వ తేదీన విచారణ చేపట్టనుంది. "బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హెూం మంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చౌధ్రీ అబ్దుల్లా అల్ మమున్‌పై ఐసీటీ నేరాభియోగాలు మోపింది" అని ప్రాసిక్యూషన్ లాయర్ మీడియాకు వెల్లడించారు. విద్యార్థుల ఆధ్వర్యంలో జులై-ఆగస్టులో జరిగిన ఉద్యమాన్ని అణచివేసేందుకు ఆమె ప్రయత్నాలు చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. ఉద్యమకారులను భారీ సంఖ్యలో చంపించడం, హింసించడం వంటి నేరాభియోగాలు కూడా ఆమెపై ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విచారణకు మమున్ మాత్రమే వ్యక్తిగతంగా హాజరుకానున్నారు. ఉద్యమకారులను అణచివేయమని హసీనా ఆదేశిస్తున్నట్లు చెబుతున్న ఓ ఆడియో క్లిప్‌ను పశ్చిమ దేశాలకు చెందిన మీడియా సంస్థ వెలుగులోకి తెచ్చింది. సీనియర్ పోలీసు అధికారికి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు సదరు సంస్థ పేర్కొంది. గతేడాది ఆగస్టులో జరిగిన విద్యార్థి ఉద్యమం కారణంగా హసీనా ప్రభుత్వం అధికారం కోల్పోయింది. ఆ తర్వాత ఆమె భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు.



## వద్దంటున్నా.. వంతెనను వాడారు

### గంభీర బ్రిడ్జ్‌పై వెలుగులోకి స్థానికుల ఫిర్యాదులు

**గుజరాత్ :** గుజరాత్‌లో 16 మంది మృతికి కారణమైన వడోదర సమీపంలోని గంభీర వంతెన ప్రమాదకరమని ఎప్పటినుంచో హెచ్చరికలు ఉన్నాయి. తాజాగా దీని నాణ్యతకు సంబంధించి గతంలో స్థానికులు, ప్రజాప్రతినిధులు చేసిన ఫిర్యాదులు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. ఈ వంతెనను 1986లో నిర్మిం చారు. కొన్నేళ్లక్రితం వడోదర జిల్లా పంచాయత్ సభ్యుడు హర్షద్‌సిన్హా పర్మార్ ఆర్అండ్‌బీ శాఖకు ఓ లేఖ రాశారు. గంభీర బ్రిడ్జ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందని అందులో హెచ్చరించారు. ఈ వంతెనపై ప్రయాణం సురక్షితం కాదని ప్రకటించాలంటూ 2022 ఆగస్టులో ఆయన డిమాండ్ చేశారు. దానిపై వాహనాల రాకపోకలు సాగకుండా మూసివేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు.. ఆ ప్రాంతంలో మరో వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇక అక్టోబర్ 2022లో మోర్బి వంతెన కూలిన తర్వాత కూడా పర్మార్ మరోసారి జిల్లా కలెక్టరేట్‌కు అభ్యర్థన పంపారు. తాజాగా పర్మార్ ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ "వంతెన పిల్లర్లలో ప్రకంపనలు వచ్చేవి. ఈ నిర్మాణం పరిస్థితిపై ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశాను. ఆ వంతెన కూలుతుందని అధికారులకు తెలుసు. కానీ, ఎవరూ చర్యలు తీసుకో లేదు" అని పేర్కొన్నారు. ఇక ఆర్టీఐ యాక్టివిస్ట్ లఖన్ దర్బార్ మాట్లాడుతూ.. 2022లో ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్ ఈ వంతెన వాడకానికి పనికిరాదని తేల్చిందన్నారు. "ఈ బ్రిడ్జ సురక్షితం కాదు. టెస్టింగ్ రిపోర్ట్ ప్రతికూలంగా వచ్చింది. అయితే మేము ఎంత డిమాండ్ చేసినా ఆ నివేదికను బహిర్గతం చేయలేదు. మూడేళ్లుగా బ్రిడ్జ్‌ను వాడుతూనే ఉన్నారు" అని పేర్కొన్నారు. ఇక ఆర్అండ్‌బీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.ఎం.నాయకవాల స్పందిస్తూ తమ డిపార్ట్‌మెంట్ నివేదికలో గంభీర వంతెనలో ఎటువంటి లోపాలను గుర్తించలే దన్నారు. బేరింగ్‌లో సమస్యలు ఉంటే గతేడాది వాటిని సరిచేసినట్లు చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రమాదంపై తీవ్రంగానే స్పందించింది. సంబంధిత అధికారులను దీనిపై వివరణ కోరినట్లు ప్రభుత్వ ప్రతినిధి రిషికేశ్ పటేల్ పేర్కొన్నారు. మంత్రివర్గంలో చర్చించినట్లు పేర్కొన్నారు.

# దూకుడైన ఆట లేదు

- ఇంగ్లాండ్ 251/4
- రాణించిన రూట్
- భారత్‌తో మూడో టెస్టు




**లండన్:** భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో టెస్టు.. తొలి రెండు టెస్టులకు భిన్నంగా మొదలైంది. దూకుడైన ఆట లేదు.. పరుగుల జోరు లేదు. మందకొడి పిచ్‌పై జాగ్రత్తగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. తొలి రోజు, గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. జో రూట్ (99 బ్యాటింగ్‌బీ 191 బంతుల్లో) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడితో పాటు స్టోక్స్ (39 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు .పోప్ (44) రాణించాడు. నితీశ్ కుమార్‌రెడ్డి రెండు వికెట్లు పడగొట్టాడు. రెండో రోజు ఉదయం సెషన్లో భారత బౌలర్లు ఎలా బౌలింగ్ చేస్తారన్నది మ్యాచ్ గమనాన్ని నిర్దేశించనుంది.

### మొదలెట్టిన నితీశ్:

ఊహించినట్లే ఈ మ్యాచ్‌కు భారత్ ప్రసిద్ధ్ కృష్ణను తీసుకోలేదు. బుమ్రా జట్టులోకి వచ్చాడు. జట్టులో టీమ్‌ఇండియా చేసిన ఏకైక మార్పు ఇదే. టాస్ గెలిచిన బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బజ్‌బాల్ శకంలో ఇంగ్లాండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకోవడం ఇది రెండోసారి మాత్రమే కావడం విశేషం. భారత పేస్ త్రయం బుమ్రా, ఆకాశ్‌దీప్, సిరాజ్ ఇంగ్లాండ్ బ్యాటర్లను పరీక్షించారు. కానీ నితీశ్ కుమార్ రెడ్డి వికెట్ల పతనాన్ని ఆరంభించాడు. తొలి రెండు వికెట్లను అందించాడు. ఇంగ్లిష్ ఓపెనర్లు బెన్ డకెట్ (23), జాక్ క్రాలీ (18) తొలి గంటలో భారత పేస్‌ను తట్టుకుని నిలిచారు. 13 ఓవర్లలో ఇంగ్లాండ్ స్కోరు 39/0. బుమ్రా రెండు ఎండ్‌ల నుంచి బౌలింగ్ చేశాడు. అతణ్ని ఎదుర్కొని పరుగులు చేయడం ఆతిథ్య జట్టు బ్యాటర్లకు కష్టమైపోయింది. కానీ బుమ్రాకు వికెట్లు మాత్రం దక్కలేదు. అయితే గిల్.. నితీశ్‌ను బరిలోకి దించడం సత్ఫలితాన్నిచ్చింది. అతడు ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. తొలి వికెట్ రావడం అదృష్టమే. నితీశ్ షార్ట్ బంతి డకెట్ గ్లోవ్స్‌ను ముద్దాడుతూ వెళ్లి లెగ్‌సైడ్ వికెట్‌కీపర్ పంత్ చేతుల్లో పడింది. క్రాలీని మాత్రం ఓ చక్కని బంతితో ఔట్ చేశాడు నితీశ్. లేట్‌గా స్వింగై స్ట్రెయిట్ అయిన బంతికి క్రాలీ ఎడ్జ్‌తో పంత్‌కు చిక్కాడు. ఆ తర్వాత చక్కగా బ్యాటింగ్ చేసిన రూట్, పోప్ లంచ్ వరకు మరో వికెట్ పడనివ్వలేదు. అయితే ఈ సెషన్లో ఇంగ్లాండ్ బజ్‌బాల్‌కు భారత్ చెక్ పెట్టింది. సాధారణంగా దూకుడైన ఆటతో పరుగులు రాబట్టే ఆ జట్టు 3.32 రన్‌రేట్‌తో మాత్రమే పరుగులు చేయగలిగింది. 2022లో మెక్‌కలమ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక ఇంగ్లాండ్ మొదట బ్యాటిం గ్ చేసిన 17 సందర్భాల్లో తొలి సెషన్లో ఆ జట్టు అతి తక్కువ రన్‌రేట్ ఇదే.

### నిలిచిన రూట్:

తొలి సెషన్లో రెండు జట్లు సమంగా నిలవగా.. రెండో సెషన్లో ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. పట్టుదలగా నిలిచిన రూట్, పోప్ అజేయంగా సెషన్‌ను ముగించారు. ఈ జంట చాలా సహనంతో బ్యాటింగ్ చేసింది. కానీ భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఈ సెషన్లో కూడా వేగంగా పరుగులు రాలేదు. జాగ్రత్తగా ఆడిన బ్యాటర్లు 24 ఓవర్లలో 70 పరుగులు మాత్రమే చేశారు. రూట్, పోప్ సంప్రదాయ శైలిలో ఆడారు. రిస్క్ చేయడానికి ఇష్టపడలేదు. షాట్ల కోసం తొందరపడలేదు. ఆఫ్‌స్టంప్ లోగిలిలో బంతులను వదిలేశారు. నితీశ్ బౌలింగ్‌లో ఫైన్ లెగ్‌లో బౌండరీతో రూట్ అర్ధశతకం పూర్తి చేశాడు. ఇందుకు అతడు 102 బంతులు ఆడడం గమనార్హం. అతడికి అండగా నిలిచిన పోప్ మరింత జాగ్రత్తగా బ్యాటింగ్ చేశాడు. సెషన్ ముగిసే సరికి ఇంగ్లాండ్ 153/2తో నిలిచింది. ఈ సెషన్లో ఒక్క వికెట్ పడగొట్టలేకపోయిన భారత్‌కు పంత్.. గాయంతో మైదానాన్ని వీడడం పెద్ద దెబ్బ. అయితే టీ తర్వాత తొలి బంతికే వికెట్ పడగొట్టి భారత శిబిరంలో ఆనందాన్ని నింపాడు జడేజా. కాస్త తిరిగిన బంతికి పోప్ ఎడ్జ్‌తో వికెట్‌కీపర్ జురెల్‌కు చిక్కడంతో 109 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే ఇంగ్లాండ్‌కు మరో దెబ్బ. బ్రూక్ (11)ను బుమ్రా బౌల్డ్ చేయడంతో ఆ జట్టు 172/4తో నిలిచింది. వెంటనే మరో వికెట్ పడగొట్టి ఉంటే తొలి రోజు భారత్ పరిస్థితి భిన్నంగా ఉండేదే. కానీ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన రూట్.. ఎలాంటి అవకాశమూ ఇవ్వలేదు. స్టోక్స్ కూడా పట్టుదలగా నిలబడ్డాడు. ఎన్నో బంతులు వదిలేశాడు. సింగిల్స్‌తో సంతృప్తి పడ్డాడే కానీ.. ధాటిగా ఆడేందుకు ప్రయత్నించలేదు. రూట్ కూడా అంతే. సింగిల్స్‌తోనే ముందుకు సాగాడు. కానీ జడేజా బౌలింగ్‌లో ఓ స్లాగ్‌స్వీప్‌తో ఫోర్ సాధించాడు. క్రమంగా 90కి చేరుకున్నాడు. గిల్ బౌలర్లందరినీ ఉపయోగించినా ఈ భాగస్వామ్యాన్ని విడదీయలేకపోయాడు.



## అమ్మాయిలు అదరగొట్టేశారు

### ఇంగ్లాండ్‌పై తొలిసారి టీ20 సిరీస్ సొంతం

**మాంచెస్టర్:** అదిరిపోయే ఫామ్‌లో ఉన్న భారత మహిళా క్రికెటర్లు ఇంగ్లాండ్ గడ్డపై చరిత్ర సృష్టించారు. టీ20లో ఆ జట్టుపై భారత్ తొలిసారి సిరీస్ విజయాన్ని అందుకుంది. బుధవారం నాలుగో టీ20లో ఆరు వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. మరో మ్యాచ్ మిగిలివుండగానే 3–1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. 2006లో డెర్బీలో జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై భారత్ పైచేయి సాధించింది. అప్పట్నుంచి ఇప్పటి వరకు ఇంటా, బయటా ఇంగ్లాండ్‌పై భారత్ సిరీస్ నెగ్గలేకపోయింది. ప్రస్తుత పర్యటనలో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తాచాటడంతో అలవోకగా సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. భారత బౌలర్ల దెబ్బకు 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 126 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ సోఫియా డంక్లీ (22బీ 19 బంతుల్లో 2ఐ4, 1ఐ6) టాప్ స్కోరర్. సిరీస్‌లో భారత విజయాల్లో కీలకంగా మారిన తెలుగమ్మాయి శ్రీచరణి (2/30) మరోసారి విజృంభించింది. రాధ యాదవ్ (2/15), అమన్‌జ్యోత్ కౌర్ (1/20), దీప్తిశర్మ (1/29) కూడా సత్తాచాటడంతో ఇంగ్లాండ్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. స్మృతి మంధానా (32, 31 బంతుల్లో 5(4)), షెఫాలీ వర్మ (31, 19 బంతుల్లో 6(4)), జెమీమా రోడ్రిగ్స్ (24 నాటౌట్, 22 బంతుల్లో 1(4)), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (26, 25 బంతుల్లో 3(4)) రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. సిరీస్‌లో ఆఖరి టీ20 శనివారం జరుగుతుంది.



## ఆసియాలోని 10 అగ్రగామి టెక్ నగరాల్లో హైదరాబాద్

**దిల్లీ:** టెక్ నిపుణుల లభ్యత అత్యధికంగా ఉన్న ఆసియా–పసిఫిక్‌లోని 10 అగ్రగామి నగరాల్లో మనదేశంలోనే 6 ఉన్నాయి. బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ–ఎన్‌సీఆర్, ముంబయి, పుణె, చెన్నైలలో సాంకేతిక నిపుణుల లభ్యత అత్యధికంగా ఉన్నట్లు 'కొలియర్స్ గ్లోబల్ టెక్ మార్కెట్స్: టాప్ టాలెంట్ లొకేషన్స్ 2025' నివేదిక వెల్లడించింది. ఆసియా–పసిఫిక్ దేశాలకు సంబంధించి అగ్రగామి 5 నగరాల్లో సింగపూర్ మాత్రమే భారత్‌కు వెలుపల ఉన్న నగరమని వివరించింది. అగ్రగామి 10 నగరాల్లో తైపీ, సిడ్నీ, మెల్‌బోర్న్ కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా చూసినా టెక్ నిపుణుల లభ్యత మనదేశంలో అత్యధికంగా ఉంది. నిపుణులకు అవకాశాలు, వెంచర్ క్యాపిటల్ ఫండింగ్, కార్మిక సూచీ, అందుబాటులోకి వచ్చే నిపుణులు, భిన్న రంగాలకు కావాల్సిన నిపుణుల లభ్యత వంటి అంశాల్లో అంతర్జాతీయంగా 200 మార్కెట్లను విశ్లేషించి, ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

### ఈ నివేదిక ప్రకారం..

డేటా సైంటిస్టుల లభ్యత బెంగళూరులో అధికంగా ఉంది. 25 ఏళ్లలోపు సాంకేతిక నిపుణుల్లో అధికులు హైదరాబాద్‌లోనే ఉన్నారు.

ఆసియా–పసిఫిక్ దేశాల్లోని టెక్ నిపుణుల్లో 69% మంది భారత నగరాల్లోనే ఉన్నారు. నీ ప్రపంచ అగ్రగామి 10 టెక్ నిపుణుల కేంద్రాల్లోనూ.. బెంగళూరు, బీజింగ్, టోక్యో ఉన్నాయి.

అత్యంత కీలక నైపుణ్యాలు, ఐటీకి కావాల్సిన మౌలిక వసతులు, గ్రేడ్ ఏ కార్యాలయ స్థలాలు, తక్కువ నిర్వహణ – నిపుణుల వ్యయాల వంటివి టెక్నాలజీ రంగంలో భారత్‌ను ప్రపంచానికే ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి.

## హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీగా ప్రియా నాయర్



**దిల్లీ:** హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) కొత్త సీఈఓ, ఎండీగా ప్రియా నాయర్ నియమితులయ్యారు. 2025 ఆగస్టు 1 నుంచి అయిదేళ్ల పాటు ఆమె పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం యునిలీవర్ ప్రెసిడెంట్ (బ్యూటీ, వెల్‌బీయి ంగ్)గా ఆమె వ్యవహరిస్తున్నారు. ఈ నెల 31న కంపెనీ సీఈఓ, ఎండీ బాధ్యతల నుంచి తప్పుకోనున్న రోహిత్ జావా స్థానాన్ని ప్రియా భర్తీ చేయనున్నారు. హెచ్‌యూఎల్ బోర్డులోనూ ఆమె చేరనున్నారు. ఇందుకు నియంత్రణ పరమైన అనుమతులు లభించాల్సి ఉంటుంది. 1995లో హెచ్‌యూఎల్‌లో చేరిన ప్రియా నాయర్, పలు కీలక పదవులు నిర్వహించారు. హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీగా బాధ్యతలు చేపట్టనున్న తొలి మహిళగా ప్రియా నిలిచారు.

## వాణిజ్య చర్చల కోసం మళ్లీ అమెరికాకు మన బృందం



**దిల్లీ:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు మరోవిడత చర్చలు చేపట్టడానికి భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ బృందం ఒకటి త్వరలో వాషింగ్టన్‌కు వెళ్లనుంది. వ్యవసాయం, వాహన రంగాల వంటి అంశాల్లో భేదాభిప్రాయాలను తొలగించుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వాణిజ్య విభాగ ప్రత్యేక కార్యదర్శి, భారత ముఖ్య సంధానకర్త రాజేశ్ అగర్వాల్ తెలిపారు. 'మధ్యంతర, తొలి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను వేరుగా చూడడం లేదు. ఒక పూర్తి ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాం. ఏ అంశాలపై ఏకాభిప్రాయం వస్తుందో, వాటినే మధ్యంతర ఒప్పందంగా తీసుకొస్తాం. మిగతా వాటిపై చర్చలు కొనసాగుతాయ'ని వివరించారు.

### ఒప్పందం ఖరారుకే యత్నాలు:

అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడానికే భారత్ ప్రయత్నిస్తోందని రాజేశ్ అగర్వాల్ వివరించారు. సెప్టెంబరు–అక్టోబరు నాటికి తొలి దశ ఒప్పందం, అంతకు ముందే మధ్యంతర ఒప్పందం కుదుర్చుకోవాలన్నది ఇరు దేశాల యత్నం. ఇప్పటిదాకా భారత్ 26 దేశాలతో 14 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) కుదుర్చుకుందని అగర్వాల్ తెలిపారు. 'బ్రిటన్‌తో ఒప్పందం ఖరారైంది. ఐరోపా సమాఖ్యతో చర్చలు ముందస్తు దశలో ఉన్నాయి. అమెరికాతో ఒప్పందం తుది రూపునకు తీసుకురావడానికి చర్చిస్తున్నామ'ని గురువారమిక్కడ ఆయన పేర్కొన్నారు.

### అమెరికాపై ప్రతీకార సుంకాల సవరింపునకు ప్రతిపాదన:

ఉక్కు, అల్యూమినియంపై సుంకాన్ని 25% నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు అమెరికా ప్రకటించడంతో.. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనల కింద ఆ దేశంపై ప్రతీకార సుంకాలను సవరించాలని భారత్ ప్రతిపాదించింది. 'టారిఫ్ రేట్లను సవరించడానికి భారత్‌కు హక్కు ఉంది. అమెరికా తన టారిఫ్‌ను 25% నుంచి 50 శాతానికి చేర్చడం ఇందుకు నేపథ్యమ'ని బుధవారం డబ్ల్యూటీఓ తన సభ్యదేశాలకు సమాచారం ఇచ్చింది.

## ఎల్‌పీజీ సంస్థలకు రూ.35,000కోట్ల పరిహారం



**దిల్లీ:** వంట గ్యాస్ సరఫరాలో నష్టాలు చవిచూస్తున్న చమురు మార్కెటింగ్ సంస్థలకు రూ.30,000–35,000 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం త్వరలో చెల్లించే అవకాశం ఉంది. గత 15 నెలలుగా వాస్తవ వ్యయం కంటే తక్కువ ధరకే ద్రవీకృత పెట్రోలియం వాయువు (ఎల్‌పీజీ)ను అమ్ముతున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలకు ఈ మొత్తం అందుతుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఈ కంపెనీలు రూ.28,249 కోట్లు నష్టపోగా, ప్రభుత్వం రూ.22,000 కోట్లే పరిహారంగా అందించింది. 2025–26 బడ్జెట్‌లో ఈ పరిహారం కోసం ప్రత్యేక కేటాయింపు చేయలేదు. అయితే పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని ఏప్రిల్ నుంచి పెంచడం ద్వారా రూ.32,000 కోట్లను ప్రభుత్వం సమీకరించింది. ఈ నిధులనే ఇప్పుడు చమురు సంస్థలకు చెల్లిస్తుందని సమాచారం. వంటగ్యాస్ సిలిండర్లను వాస్తవ వ్యయం కంటే తక్కువ ధరకు విక్రయించడం వల్ల, పరిశ్రమకు 2024–25లో రూ.40,500 కోట్ల నష్టం వచ్చినట్లు అంచనా. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోగ్రాముల సిలిండర్ ధరను రూ.50 పెంచడం ద్వారా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో ఈ నష్టాలు తగ్గిస్తున్నారు.

## ఫిన్‌టెక్ 'వైజ్' కేంద్రం హైదరాబాద్‌లో..

**హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి డబ్బు తరలించడం, నిర్వహణకు సంబంధించిన ఫిన్‌టెక్ సేవల సంస్థ వైజ్, హైదరాబాద్‌లో తన కేంద్రాన్ని ప్రారంభిస్తోంది. ఇందులో వందల సంఖ్యలో సిబ్బందిని నియమిస్తామని వెల్లడించింది. ప్రోడక్ట్, ఇంజినీరింగ్, సర్వీసింగ్ విభాగాల్లో నియామకాలు చేపడతామని వెల్లడించింది. అంతర్జాతీయ ఖాతా వివరాల సదుపాయమూ ఇక్కడ లభిస్తుంది. దీనివల్ల వ్యాపారవేత్తలు మధ్యస్థ మార్కెట్ మారకపు రేటుతో 8 కరెన్సీల్లో (డాలర్, పౌండ్, యూరో, ఆస్ట్రేలియా డాలర్, సింగపూర్ డాలర్ తదితరాలు) విదేశాల నుంచి చెల్లింపులు పొందొచ్చు. హైదరాబాద్ కేంద్రం నిర్వహణ బాధ్యతలను స్మృతి రవి చేపడతారు. హైదరాబాద్‌లో అత్యంత నైపుణ్యాలున్న ఇంజినీర్ల లభ్యత అధికంగా ఉన్నందునే, వైజ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రపంచ కార్యకలాపాల్లో, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్‌లో ఈ కేంద్రం క్రియాశీలక పాత్ర పోషిస్తుందని స్మృతి తెలిపారు.

### 2.5 లక్షల డాలర్లు పంపొచ్చు:

వైజ్ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన కంపెనీ. 2013 నుంచి అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ప్రవాస భారతీయులు మనదేశానికి పంపుతున్న సొమ్ములో (రెమిటెన్సెస్) 10% వైజ్ ప్లాట్‌ఫామ్ ద్వారానే వస్తోంది. 2021లో వైజ్, మనదేశం నుంచి 'లైట్నింగ్ ఫాస్ట్ ట్రాన్స్‌ఫర్స్' సదుపాయాన్ని ప్రారంభించింది. ఎల్‌ఆర్‌ఎస్ (లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్) కింద గరిష్ఠ పరిమితి అయిన 2.5 లక్షల డాలర్ల వరకు వైజ్ కస్టమర్లు మనదేశం నుంచి విదేశాలకు పంపించొచ్చు. గంటన్నర వ్యవధిలోనే ఈ సొమ్ము విదేశీ ఖాతాలోకి జమవుతుంది కూడా.

## అమ్మకాల ఒత్తిడి

దేశీయ సూచీలకు వరుసగా రెండో రోజూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాల ప్రారంభం నేపథ్యంలో, మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. ఐటీ, టెలికాం షేర్లు డీలాపడ్డాయి. టారిఫ్‌లకు సంబంధించిన అనిశ్చితి కూడా సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 3 పైసలు పెరిగి 85.70 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.27% నష్టంతో 70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.1.14 లక్షల కోట్లు తగ్గి రూ.460.25 లక్షల కోట్లు (5.38 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. సెన్సెక్స్ ఉదయం 122 పాయింట్ల (క్రితం ముగింపు 83,536.08) లాభంతో 83,658.20 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఇంట్రాడేలో 83,134.97 పాయింట్లకు పడింది. చివరకు 345.80 పాయింట్ల నష్టంతో 83,190.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.85 పాయింట్లు కోల్పోయి 25,355.25 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,340.45–25,524.05 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు నమోదుచేశాయి.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక





# బాహుబలి విడుదలై పదేళ్లు పూర్తి

## రాజాసాబ్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన క్లాసిక్ మూవీ 'బాహుబలి' మొదటి భాగం విడుదలై పది సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా అభిమానులే కాకుండా, చిత్ర బృందమంతా పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయారు. అదే సమయంలో ప్రభాస్ మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అది కూడా ఈసారి తన స్టైలిష్ లుక్ తో. ప్రస్తుతం ప్రభాస్, డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో మొదటి నుంచి సంబంధం ఉన్న మాస్ ప్రొడ్యూసర్ ఎస్.కె.ఎన్ తాజాగా సెట్స్ నుంచి ఓ ఫోటోను షేర్ చేయగా, అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ప్రభాస్ కనిపించిన విధానం అభిమానుల మన్ననలు పొందుతోంది. స్టైలిష్ గా ఓ వింటేజ్ లుక్‌లో – ఓపెన్ షర్ట్, కూల్ గ్లాసెస్, లైట్ బీట్ క్రాఫ్ట్ లుక్ లో కనిపించిన ప్రభాస్ యూత్‌ఫుల్ ఎనర్జీకి ప్రతీకగా నిలిచాడు. చాలాకాలం తర్వాత ప్రభాస్‌ను ఇలాంటి మాస్ క్లాస్ లుక్‌లో చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. ఇదే సందర్భంగా ఎస్‌కెఎన్ చేసిన వ్యాఖ్యలు కూడా ఫ్యాన్స్‌ను ఉత్సాహపరిచాయి. 'ఇది కేవలం ఓ బర్త్‌డే మూమెంట్ మాత్రమే కాదు, రాబోయే విజయం కోసం మొదటి సూచన కూడా..! ప్రస్తుతం జరుగుతున్న షూటింగ్ సన్నివేశాలు మెస్మరైజ్ చేస్తాయనడం గ్యారంటీ–' అంటూ తెలిపాడు. బాహుబలి పదేళ్లు పూర్తి చేసుకున్న స్పెషల్ రోజున ఇలా ప్రభాస్ నుంచి వచ్చిన తాజా లుక్ అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చిందని చెప్పొచ్చు.

# 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ విడుదల




'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహే శ్వర ఉగ్రరూపస్య' వంటి విజయవం తమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించి న నిర్మాత ప్రవీణ పరుచూరి.. ఇప్పుడు 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అనే సినిమాతో, దర్శకురాలిగా, పరిచయం అవుతున్నా రు. రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి రానా నిర్మాత గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జులై 18న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం –ట్రైలర్ విడుదల చేసింది. ఇది ఊహిం చని ట్విస్ట్‌లతో.. నాన్ స్టాప్ కామెడితో ఆకట్టుకుంది. ఇందులో రామకృష్ణ అనే యువకుడు ఒక చిన్న పట్టణంలో డ్యాన్స్ స్టూడియో నడుపుతుంటాడు. అతను సావిత్రిని ప్రేమిస్తుంటాడు, ఆమె కూడా అతని భావాలకు స్పందిస్తున్నట్లు– కనిపిస్తుంది. ఓ రోజు సావిత్రి అతన్ని గడ్డివాము వద్ద కలవమని అడుగుతుంది. ఆనందంగా వెళ్లిన రామకృష్ణ జీవితంలో అప్పటి నుంచి భారీ మలుపు తిరుగుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా, ఒక అనూహ్యమైన మిస్టరీ, దైవిక సంబంధాల నడుమ నడిచే కథ గా మారుతుంది. ఇక మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రల్లో నటిస్తూ తమ పాత్రలకు స్వచ్ఛమైన అమాయకత్వాన్ని తీసుకొచ్చారు. రవీంద్ర విజయ్ కూడా తన పాత్ర ద్వారా బలమైన ప్రభావాన్ని చూపిస్తున్నారు. మొత్తానికి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించడంలో సఫలమైంది. ఈ సినిమా జులై 18 న విడుదలకు సిద్ధమవుతుంది. రొటీన్ ప్రేమ కథలకు భిన్నంగా మలచిన ఈ గ్రామీణ డ్రామా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇచ్చే అవకాశం ఉంది.

# రామయణంలో అమితాబ్ వాయిస్ ?



ప్రతిష్ఠాత్మకంగా రానున్న 'రామాయణ' సినిమాకు సంబంధించిన వీడియో ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఇందులో నటీనటుల వివరాలు ప్రకటించిన దగ్గరనుంచి సినీ ప్రముఖులు వారి అభిప్రాయాలను తెలుపుతున్నారు. మరోవైపు, ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ కూడా భాగమైనట్లు– తెలుస్తోంది. దీనిపై కథనాలు వెలువడుతున్నాయి. ఇటీవల రూపొందిన 'కల్కి 2998 ఏడీ'లో అశ్వత్థామ పాత్రలో అద్భుతమైన నటనతో ఆశ్చర్యపరిచారు బిగ్ బీ. ఇప్పుడాయన 'రామాయణ'లోనూ భాగం కానున్నట్లు– సమాచారం. ఇందులో జటాయువు పాత్రకు అమితాబ్ వాయిస్‌ఓవర్ ఇవ్వనున్నట్లు– టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇందులో రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. దీనిపై బాలీవుడ్ నటు–డు, చిత్ర నిర్మాత రాజ్ బి శెట్టి తన అభిప్రాయాన్ని తెలిపారు. యశ్ ఎంపికపై రాజ్ తన ఇన్‌స్టాలో స్పందించారు. మొదటిసారి ఒక విలన్‌ను కూడా అందరూ మెచ్చుకుంటు–న్నారని అన్నారు. యశ్ ఆ పాత్రలో వందశాతం న్యాయం చేస్తారని తెలిపారు. మనమంతా అతడి కోసం ఎదురుచూడాలని పోస్ట్ పెట్టారు. దీనిపై యశ్ స్పందించారు. 'ధన్యవాదాలు సర్. రామాయణం.. అన్ని భావాలకు అతీతమైన కావ్యం' అని రిప్లై పెట్టారు. ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా దీని గ్లింప్స్ విడుదలైన నేపథ్యంలో రణ్‌బీర్ ఎంపికపై గతంలో ఈ సినిమా క్యాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. 'రాముడి పాత్ర పోషించాల్సినవారికి ఉండాల్సిన ప్రధాన లక్షణం ప్రశాంతత. రణ్‌బీర్ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. అందుకే నితేశ్ తివారీ అందరికంటే అతడిని ముందుగా ఎంపిక చేశారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపిక సరైనదని సినిమా చూశాక ప్రేక్షకులకు కచ్చితంగా అర్థమవుతుంది. నటనలో ఆయనతో ఎవరూ పోటీ– పడలేరు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకేలా ఉంటాడు' అంటూ రణ్‌బీర్‌పై ముఖేశ్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. రావణుడి సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించే అవకాశం ఉందని సమాచారం. రెండు భాగాలుగా ఇది రానుంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానుంది. సుమారు రూ.1600 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.



## కార్తీ కొత్త సినిమా

# మార్షల్

తమిళ హీరో కార్తీ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజిగా ఉన్నాడు. విభిన్న కథలతో సినిమాలు చేస్తూ తనకంటూ సెపరేట్ గుర్తింపు తెచ్చుకున్నాడు. అటు తమిళ్ తో పాటు ఇటు తెలుగులోను కార్తీ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. కార్తీ నటించిన యుగానికి ఒక్కడు, ఖైదీ, ఊపిరి, ఆవారా, ఖాకి, సర్దార్ వంటి సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచాయి. కార్తీ సినిమా అంటే మినిమం గ్యారెంటీ– అనే అభిప్రాయం సినిమా ప్రేక్షకుల్లో ఉంది. ప్రస్తుతం సర్దార్ కు సీక్వెల్ సర్దార్ 2 తో పాటు– మరో సూపర్ హిట్ ఖైదీ కి సీక్వెల్ ఖైది 2లో నటిస్తున్నాడు కార్తీ. ఇక ఇప్పుడు మరో సినిమా చేస్తున్నాడు. కార్తీ కెరీర్ లో 29వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు 'మార్షల్' అనే టైటిల్ ను ఫిక్స్ చేస్తూ అఫీషియల్ పోస్టర్ ను రిలీజ్ చేసారు మేకర్స్. నేడు చెన్నైలో పూజా కార్యక్రమాలతో మొదలైన ఈ సినిమాకు కోలీవుడ్ సూపర్ హిట్ సినిమా తనక్కారన్ డైరెక్ట్ చేసిన యంగ్ దర్శకుడు 'తమిళ' దర్శకత్వం వహిస్తున్నాడు. యంగ్ సెన్సషన్ సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా భారీ బడ్జెట్‌తో నిర్మించాలని ఎ÷–లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమా కథ రామేశ్వరం నేపథ్యంలో సాగుతుండడం మెజారిటి పోర్షన్ సముద్రం లొకేషన్స్ షూట్ చేయాల్సి ఉందట. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న మార్షల్ సినిమాను డ్రీమ్ వారియర్ పిచర్స్ బ్యానర్ పై ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు.

# పూజను వెన్నాడుతున్న డిజాస్టర్స్

ధనుష్ మూవీలో హీరోయిన్ ఛాన్స్ మిస్

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీ–వల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టుకుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది. తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు– తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో



ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ– మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలిక మేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అణుబాంబు కన్నా ప్రమాదకరమైనది కాపీయింగ్

## ఆర్.నారాయణమూర్తి



“విద్యను జాతీయం చేయడంతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని చెప్పే చిత్రమే ‘యూనివర్సిటీ (పేపర్ లీక్)’ అంటున్నారు ఆర్.నారాయణ మూర్తి. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా సరికొత్తగా ఆగస్టు 22న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గోరటి వెంకన్న, అద్దంకి దయాకర్, దేశపతి శ్రీనివాస్, అందెశ్రీ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. “గత కొన్నేళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీకులు.. గ్రూపు 1–2 లాంటి ఉద్యోగ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకులు చూస్తుంటే చదువులకు ఏమైందనిపిస్తోంది. ఇదిలా కొనసాగితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి. నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై అమెరికా వేసిన అణుబాంబు కన్నా చాలా ప్రమాదకరమైనది కాపీయింగ్. చూసి రాసిన వాళ్లు డాక్టర్లయితే రోగులు బతుకుతారా.. ఇంజినీర్లయితే వాళ్లు కట్టిన భవనాలు, వంతెనలు నిలబడతాయా? అందుకే ఇలాంటి దారుణాలు జరగకూడదంటే ప్రశ్నా పత్రాలు లీకుల మయం కాకూడదు. నా మిత్రులు అద్దంకి దయాకర్, అందెశ్రీ మన రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ చిత్రానికి పన్ను మినహాయింపు ఇప్పిస్తామన్నారు. దానికి వాళ్లకు కృతజ్ఞతలు. కాకపోతే నాకు పన్ను మినహాయింపు ఏమీ వద్దు. ప్రభుత్వం నుంచి ఏ సహకారం వద్దు. సినిమాని ప్రజల్లోకి తీసుకెళ్లండి చాలు” అన్నారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# ‘జైలర్ 2’ సెట్స్‌లోకి



రజనీకాంత్ నటించిన విజయవంతమైన సినిమా ‘జైలర్’లో మాథ్యూగా అతిథి పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించారు మోహన్‌లాల్. ఇప్పుడీ ఇద్దరూ ‘జైలర్ 2’ కోసం మరోసారి చేతులు కలిపేందుకు సిద్ధమయ్యారు. ‘జైలర్’కు కొనసాగింపుగా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. రమ్యకృష్ణ, మిర్నా మేనన్, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే తొలి భాగంలో కనిపించిన అతిథి పాత్రలతో పాటు మరికొన్ని పాత్రలు ఈ రెండో భాగంలో కనిపించనున్నాయి. అయితే ఇప్పుడీ సినిమా కోసం మోహన్‌లాల్ చెన్నైలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో అడుగు పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయనతో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే రజనీ కూడా తిరిగి సెట్‌లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ కోసం త్వరలోనే బాలకృష్ణతో పాటు శివ రాజ్‌కుమార్ కూడా సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇది వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది.




# విజయ్ సేతుపతి..

## మూవీ తెలుగులో సార్ మేడమ్

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తలైవన్ తలైవి'. ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే తమిళంలో టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను తెలుగులో సార్‌మేడమ్ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భం గా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఫుడ్ బ్యాక్‌డ్రాప్ లో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ టీజర్ లో విజ య్ సేతుపతి, నిత్యా మీనన్ మధ్య ఉండే కెమి స్ట్రీని చూపించారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com